అభ్యుదయ

ే 1978 వెల రూ



తెలుగు కథా సాహిత్య నిర్మాతలలో విశిష్టులలో విశిష్టుడు వస్స
ఎంత పెద్ద కష్టం గుండెలోనైనా అనాయాసంగా కని
మహాకవి శ్రీ.శ్రీ

విషయసూచిక

అభినందనలు

శ్రీశ్రీకి కవిత్వమొక తీరని దాహం. తానలా రాయడమే కాదు. అది నిజంగా తీరని దాహంగానే వుంటోందాయనకు బాల్యం నుంచీ.

అప్పుడప్పుడది దుర్దాహంగా ప్రకోపించి స్రియలిజం వంటి గారడీలు చేయించినా, నేల విడిచిన విరసం మార్క్క పల్టీలు కొట్టించినా, శ్రీశ్రీ నూటికి నూరుపాళ్లు కవి. చిన్న కూనిరాగంగా ఆయన ఊళవూదితే కేదారగౌళ అవుతుంది – తనే చెప్పుకున్నట్టు. వెనకటికో కవి వాణి నా రాణి అని ప్రకటించాడు యీయనలాగనే. అది నిజమే అయినప్పుడు కాదనడమెలాగా?

గీతంలోనే కాదు, శ్రీశ్రీ వచనంలోనూ ఆవేశపు పఠాసు కూరిన బాంబుల ప్రేలుళ్లో, మనసుకు చక్కిలిగింతలు పెట్టే చమత్కారాలో, కళ్ల ముందర సాక్షాత్కరించే రమ్యమైన పద చిత్రాలో వుండక తప్పదు. ఎంత పెద్ద కవుల గుంపులోనైనా ఆజానుబాహుడుగా కనిపించే మహోత్తర మహాకవి శ్రీశ్రీ. ఇటీవల ఢిల్లీలో కన్నడ సాహితీపరుల మహాసభ ఆయనకు చేసిన సన్మానం ఆంధ్రేతరులూ శ్రీశ్రీ ఉన్నతోన్నత మూర్తిని దర్శించారన్నందుకు ఒక గుర్తు కంటె ఎక్కువేమీ కాదు.

పద్మరాజు స్థూలదృష్టికి విశిష్టుడుగా కనిపించని విశిష్టుడు. నలభైయ్యేళ్ల నుంచి రాస్తున్నా, ఆయన కథా సాహిత్యం బళ్లకెక్కించవలసినంత ప్రమాణంలో లేదు. సినీతారల బొమ్మల జుబ్బాల వారాల పత్రికలు తన కథల కోసమో, సీరియల్ నవలల కోసమో, ఎగబడేంత 'ప్రఖ్యాతి' సంపాదించుకోలేదాయన. రక్తపుపోటు పెంచే రకరకాల మసాలాల రుచులూ, ఘుమ ఘుమలూ ఆయన కథల్లో వుండవు.

అయినా తెలుగు కథాసాహిత్య నిర్మాతల్లో పద్మరాజు విశిష్టుల్లో విశిష్టుడు. ఆయన కథావస్తువు, శిల్పమూ చెహోవ్ తరహావి. కథాకథనంలో ఒక విధంగా గురజాడ పద్ధతి ఆయనది. ఎటువంటి ఆభరణాలు, అలంకారాలూ లేకుండానే యింపుగా కనిపించే అందగత్తెలు ఆయన కథలు.

అవి క్లయిమాక్సుల కోసం తంటాలు పడవు. వెకిలి ఉపమానాలు వెతుక్కోవు, మాటమాటికీ చమత్కారాలు రువ్వడానికి చెమట్లు కక్కవు. ఆయన కథలు కవిత్వంలాగా కాకండా కథలుగా వుంటాయి. సరిగ్గా జీవితంలాగా వుంటాయి. తెలుగులో వచ్చిన మంచి కథలన్నీ కలిసి ఒక సంపుటం వేస్తే గురుజాడ 'మీ పేరేమిటి'కి దిగువ మెట్టుమీద రసజ్ఞులకు కనిపించేది పద్మరాజు కథేనని చెప్పడానికి సందేహించ నక్కర్లేదు.

తాళ్లలాగే కథలు పేనడం ప్రబలమై పోయివున్నప్పటి దశలో, షష్టిపూర్తి సందర్భంగా పద్మరాజుకు సన్మానం జరగడం ఆశ్చర్యం కలిగించినా, తెలుగు దేశంలో రసజ్ఞత లేకుండా పోలేదనడానికి దాఖలాగా వుంది.

దిగంబర కవిత
(ఒక పరిశీలన)
ఏల్చూరి మురళీధరరావు

తెలుగు సాహిత్యంలో దిగంబర కవిత్వానికి చాలా విశిష్టమైన స్థానముంది. ఈ కవులు అప్రతిమానమైన ఆవేశాన్ని వచన గేయంలో మూసపోసి ముందుంచిన ప్రతిభావంతులనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

నగ్నముని కవిత్వానికి మూర్ధన్య ప్రాయమైన నిర్మాణ మార్మికతను కూలంకషంగా గ్రహించినవాడు. "నా కళ్లు దున్నిన। ఈ నాగేటి చాళ్లే నా వేళ్లు। రచిస్తున్నవి మంటలు। మోడు నేలంతా మోదుగులా ఎర్ర బడింది। కాలం గొంతెత్తి పిలుస్తున్నది। చల్లు విత్తులు। మొలిచేవి కత్తులు। ఈ రుధిరపు ఋతువు వెనకే। నవ సమాజపు నూరు శరత్తులు"–అంటాడు "తూర్పు" గేయంలో. ఆయన, దేశ శ్రేయస్సును సాధించడానికి సాధన భూతమని తాను విశ్వసించిన సాయుధ విప్లవాన్ని రగిలించే భావ సమైక్యతకు కవిత్వాన్ని అంకితం చేసి తన కవితకు నాయకుడుగా నిలిచిన అసామాన్యుడైన సామాన్యుడిని – "నరుడా శివుడా। నీ వెంటే నడుస్తుంది నా వ్యక్తిత్వం। నీ వెంటే నడుస్తూంది విప్లవ వ్యక్తిత్వంగల నా తరం। నీ వెంటే నడుస్తూంది సాయుధ ప్రపంచం। నీ వెంటే నడుస్తుంది సంఘర్ష చరిత్ర సమస్తం" – అంటూ ఉత్తేజితుణ్ణి చేస్తాడు. "సమాధుల చుట్టూ పూల మొక్కలు। సమాధుల మీద పూలూ, దీపాలూ। సమాధుల్లో దేశం కోసం చేసిన త్యాగాలు। సమాధుల ముందు నక్కలు రాబందుల వొంగి వొంగి దణ్ణాలు" – అంటాడు. లలితమైన హాస్యం కూడా ఈ నిందకు వెంట నడుస్తుంటుంది. "రోడ్డు మీద। సాయంత్రం శవం మీద చీమల్తో బాటు నడుస్తున్నాను। రోడ్డు పక్కన మరిన్ని చీమలు చేరి గుంపులు గుంపులుగా వింటున్నాయి। లౌడ్ స్పీకర్లలో గాడిదలు ఓండ్ర పెడుతున్నాయి। ఏమిటదని అడిగాను। ఎలక్షన్లొస్తున్నాయి నాయకులు ఉపన్యసిస్తున్నారు। అన్నది ఓ గుమాస్తా చీమ" – అంటాడు "ఋతువు" గేయంలో. హృదయ విద్రావణమైన అతని ఆత్మ చరిత్రను అక్షరబద్ధం చేస్తూ "పాలు ఎర్ర బడ్డాయి" అన్న కవితలో తరతరాలుగా సమాజ వృక్షాన్ని పట్టి పీడించుతున్న వేరుపురుగులు క్రూరతత్త్వాన్ని స్పష్టమైన అనుభవాలతో సూటిగా ప్రదర్శిస్తాడు. నిర్ద్వంద్వమైన ఇతని అభిప్రాయ వ్యక్తీకరణ, నిర్భీకమైన ప్రయోగ నిర్మాణశక్తి, నిస్సంకోచమైన వాక్యనిర్మితి ఇతనిని గొప్ప కవుల సరసన నిలబెట్టినాయి. నినాదాల స్థితిని దాటిన ఇతని కవిత్వం కవితా దశను కూడా అధిగమించి కళాస్థాయిని చేరుకొన్నది.

నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు, మహాస్వప్నలు కూడా శక్తిమంతమైన వాక్య నిర్మాణశక్తి కలవారు. "నా సంస్కృతి నన్ను కాల దన్నేసినపుడు। వేల సంవత్సరాల ఔన్నత్యం నా కళ్ల ముందు నా ఆలోచనల దాడికి శిథిలమై। ...నా యింటి కిటికీలోంచి మరో సముద్రపు గాలి। ఉద్ధృతంగా వీచి విశ్వాసాలను కూల్చినప్పుడు" – అన్న నిఖిలేశ్వర్ గేయంలో ధ్వని గర్భితంగా దోబూచులాడుతున్న సిద్ధాంతాన్ని ఇందుకు నికషోపలంగా స్వీకరింపవచ్చు. వీరిలో జ్వాలాముఖి కవిగా నెలకొనడంతోపాటు విమర్శక పీఠాన్ని అధిరోహించి సాహిత్య చరిత్రను అవలోడనం చేశాడు. పటిష్ఠమైన కవితా చైతన్యంతోపాటు శత్రుపతనాన్ని చారిత్రక సంభవంగా నిరూపించాలన్న ప్రయత్నం అన్నమాట.

చెరబండరాజు గేయాలలో అలంకారికమైన ముద్ర ఒకటి సర్వాంగీణమైన పరిపూర్ణతతో ప్రతిఫలిస్తుంటుంది. పోరాటశక్తిని మేల్కొలపడానికి అనుగుణమైన సమస్యలను దీప్తిమంతమైన వ్యాజస్తుతితో చిత్రిస్తూ ఆయన అంటాడు – "దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలం నీది। అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది। సంపన్నుల చేతిలో మైమరచి నిద్రిస్తున్న యవ్వనం నీది। ఊసినా దుమ్మెత్తి పోసినా చలనం లేని మైకం నీది। కోతకొచ్చిన చేనులో కలుగులు తవ్వుతున్న – ఎలుకల్నీ పంది కొక్కుల్నీ భరిస్తూ నుంచున్న 'భారతి' వమ్మా। నోటికందని సస్యశ్యామల సీమవమ్మా। వందేమాతరం వందేమాతరం" జానపదమైన తెలుగు భాషలోని సౌందర్యాన్ని విజయవంతంగా ఆవిష్కరించి కృతకృత్యులైన దిగంబర కవులలో ఈయన అగ్రగణ్యుడు. సంఘంలోని తిరోగామిశక్తుల దౌర్జన్యానికి బలైపోయిన సామాన్యుల ఆక్రోశనలను, ఆక్రందనలను వినిపించి కొసకు – "చెరువులో దూకనా। చెరువయ్యి పోదునా। ఉరిపోసు కొందునా। ఉరితాడు నవుదునా। రాయిరప్పకు సెప్పనా – నాగోడు। నేనే రాయై పోదునా।" అని పరిష్కార మార్గాన్ని సూచించిన తీరు ఆలోచనామృతత్వానికి సాక్షీభూతమైన చక్కని రూపం. తెలుగు దేశంలో జానపద వాఙ్మయం ప్రచురమైన రోజుల వైభవాన్ని జ్ఞాపకం చేస్తూ పల్లె ప్రజల భాషలో ఆయన పోలీసులను హెచ్చరిస్తాడు – "మాలోని మనిషివే." నువ్వంటూ "మనిషన్న కాడికీ మనసంటు ఉంటాది। పల్లెత్తి ఒక మాట పలుకనీ నీ కొలువు చావనా బతకనా సత్తెమాలోచించు। దొంగ సర్కారులో పాలుపంచూకోకు..." అంటాడు.

ఈ కవులందరిలోనూ ఒక్క మహా స్వప్నదే కొంచెం బలహీనమైన గొంతు. ఆవేశానికి సమస్థాయిలో ఉన్న ప్రతీకలను, పదపుంజాలను సమకూర్చుకొనలేక విఫలం కావడం మనకు పలుతావులలో ప్రస్ఫుటమౌతుంటుంది. వాక్య నిర్మాణ శక్తిలో లోపించిన గడుసుదనం అడుగడుగునా కనుపిస్తుండడం వల్ల ఈయన గేయాలు నినాదాల దశను దాటలేక పోయినాయి. భావాలలో అనుకరణ పాలు హెచ్చు. పాదవిభజన పద్ధతి, అభిప్రాయ వ్యక్తీకరణ వైచిత్రి, శ్రామిక సంస్కృతీ జీవన విధానాల పట్లగల అవగాహన ఈయన తన సహకవుల

స్థాయిని చేరలేక పోయాడు. చెప్పదలచుకొన్న దానిని సూటిగా, స్పష్టంగా చెప్పడంలో మాత్రం ఈయనదే పైచేయి.

దిగంబర కవితోద్యమం ఉధృతమై, ప్రభంజన సదృశమై వీచిన తొలి రోజులలోనే భైరవయ్య ఈ కవుల పంక్తి లోనికి వచ్చి నిలచాడు. మనిషిలో చావకుండా మిగిలి ఉన్న నిజాయితీని, తిరుగుబాటు తత్త్వాన్ని మేల్కొలపడానికి కవిత్వమే పరమ సాధనమని విశ్వసించిన ఈయన ప్రారంభ దశ నుంచీ తీవ్ర వాది. "నా దేశ ప్రజల్ని నిలువునా దోపిడీ చేస్తున్న శక్తుల్ని చూసి, గుండెలు కుతకుత ఉడుకెత్తేవి. వీళ్లందర్నీ నమిలి మింగెయ్యాలన్నంత ఆవేశం వచ్చేది. యువతరం నిస్సారంగా తమ జీవితాలు గడిపేస్తుంటే విపరీతమైన ఆవేదన కలిగేవి. ఏవిధంగా కొన్ని శతాబ్దాలుగా నిద్రాణమైన జాతిని మేల్కొలపడమా అని ఆలోచిస్తూ వుండేవాణ్ణి. . . " అన్నాడు తనుకవిగా అవతరించిన ఘట్టాన్ని వివరిస్తూ కావ్యపీఠికలో ఆయన. దిగంబరకవులు స్వీకరించిన ప్రతీకలను, కవి సమయాలను అధునాతనమైన స్వీయదృక్పథంతో మేళవించి ఈయనకూడా తన ప్రతిభను చాటుకొన్నాడు. హృదయకుహరంలో తాండవిస్తున్న అశాంతిని జుగుప్స రూపంలో వెలికి తెస్తూ – "కొడిగట్టిన చుట్టనుసిలా, ముసుగేసుకున్న విధవలా, అలముకుంది వెన్నెల"– అంటున్న వర్ణన ఇందుకు నిదర్శనం. సాంప్రదాయిక

ఆధునిక రాజకీయం

టి. ప్రసన్నకుమార్

పాత రోజుల్లో
ప్రాణం పోయిన
ప్రజాస్వామ్యం
ఓటు వరంతో
మరో మాటు పుట్టింది
మంత్ర సానులు
మంత్రులయ్యారు
దేశప్రజలు
స్వతంత్రులయ్యారు.
ఎక్కడ చూసినా వేడుకలు
ఘనస్వాగత సత్కారాలు!
బస్సులు కాలి
భూరి హారతి పట్టాయి!
నల్ల తమ్ముళ్ళను దిష్టి తీసి
కులంకుంపట్లో కుమ్మరించారు !
విజృంభించిన శ్రామికవర్గ(
రాళ్ళ పువ్వులు విసిరింది
రాక రాక వచ్చిన
నీకు స్వాగతమంటూ
కళాశాలల్లో కూడా
తూటాల దీపావళి !
ఈ మహావైభవం చూసి
మళ్ళీవచ్చిన స్వేచ్ఛకు
మతిపోయింది !
ఏలికల చీలికల్లో
వెఱ్ఱిగంతులేస్తోంది
ఇంత బాహాటంగా
వీధుల్లో పడ్డ అరాచకాన్ని
సందుల్లో వెతుక్కోవడం
ఆధునిక రాజకీయం!

మైన వ్యవస్థనుంచి సంఘటనలను స్వీకరించి, ఆధునికమైన భావనతో మేళవించి రూపకాలంకారాన్ని పరిపూర్ణంగా ఈయన ప్రయోగించిన తీరు 'అణుయజ్ఞం' అన్న గేయంలో హృద్యంగా ఉంటుంది: "నాకైత ప్రేతాసనంపై మహాంకాళి సేవించే రక్తధార, దినసంధిలో సంధ్యాదేవి కక్కుతున్న నెత్తుటిచార, తాగుబోతు కళ్లల్లో తొంగిచూసే ఎర్రజీర, తక్షకుని నాలుకపై నర్తించే విషజ్వాల..." అంటూ ఆయన తన భావుకతను పదే పదే ప్రదర్శిస్తాడు.

ఉత్తుంగ తరంగాయితమైన దిగంబర కవితా వాహిని ఇక్కడితో స్తంభించి పోలేదు. తమ కవిత్వానికి, గేయాలకు సాంకేతిక నామకరణం చేసికొన్న ఈ కవులు నెలలకూ, రోజులకూ కూడా పేర్లు పెట్టుకొన్నారు. కవిత్వాన్ని పెద్దఉద్యమంగా మార్చి, ఉద్ధృతం కావించి గొప్ప సంచలనం లేవనెత్తారు. అయిదుగురూ కలిసి రచించిన గేయ సంకలనాలతో పాటు వైయక్తికంగా దిగంబరకవులు రచించిన గేయసంపుటాలుకూడా ముద్రితమైనాయి. దిగంబర కవితోద్యమం దేశం గుర్తింపక తప్పని మహాశక్తిగా పరిణమించింది.

ఈదశలో తెలుగుదేశంలో విప్లవరచయితల సంఘం ఆవిర్భవించింది. అన్నాళ్లుగా తెరమరుగున దాగిఉన్న రాజకీయాలు రంగం మీదికి వచ్చాయి. అధివాస్తవిక కవిత్వాన్ని విడిచిపెట్టి మళ్లీ అభ్యుదయకవిత్వాన్ని చేపట్టిన శ్రీ శ్రీ దీనికి అధ్యక్షుడుగా నిలిచాడు. ప్రసిద్ధులైన కొందరు రచయితలు, విమర్శకులు, చిత్రకారులు దీనిలో చేరారు. పరిణతికంటే ప్రచారంమీద ప్రేమ ఎక్కువైన కొందరు యువరచయితలుకూడా వచ్చికలిశారు. దిగంబరకవులకు, నకలుగా విజయవాడలో బయలుదేరిన పైగంబరకవులు నెమ్మది నెమ్మదిగా వచ్చి పీడితవర్గ ప్రతినిధులుగా నిలదొక్కుకున్నారు. కవితోద్యమం కుహనా రాజకీయాల కర్కశ హస్తాలలోకి జారిపోయింది. వంగ దేశంలోని నక్సల్‌బరీ గ్రామంలో తల ఎత్తిన నక్సలైటు ఉద్యమం ఈకవుల చైతన్యానికి ఇప్పుడు ఊపిరి.

దిగంబర కవుల కవిత్వం మొత్తాన్ని పరిశీలించి చూసినప్పుడు స్థూలదృష్టికయినా స్పష్టంగా కనుపట్టే విషయాలు రెండు: ఒకటి భాషను ప్రయోగాభిమానంతో కాక ఆవేశాన్ననుసరించి యధేచ్ఛంగా ఉపయోగించుకొనడం. ఈవాడుకలో ఆంగ్ల పదస్పర్శ అణుమాత్రమైనా లేకపోవడం గమనించదగ్గది. తెలుగుజాతీయతకు, నుడికారానికిలోబడి జానపద వాఙ్మయానికి సన్నిహితంగా కనుపించే ప్రక్రియలను చేపట్టడమూ చూడదగిన అంశమే. సామాన్యంగా ఈకవులు అక్షరాస్యులలో భావ విప్లవాన్ని తీసుకొని రావడానికే కృషి చేసినప్పటికీ, వివిధ కారణాల వల్ల కార్మిక కర్షక వర్గాలలోను సమాజ వ్యతిరేక భావనలు పాదుకొని ఉంటవికనుక వారిలోనూ చైతన్యం రేకెత్తించడానికి బుర్ర కథలను, ప్రాంతీయ భాషామాండలికాలను ప్రయోగించవలసి వచ్చింది. ప్రజా జీవితానికి అనతిదూరంలోనే ఉన్న దిగంబర కవులు ప్రజల భాషను, ప్రజలలోనికి చొచ్చుకొని పోగల కళారూపాలను ప్రతి తో నిర్వహించారు.

"న్యాదెంగ చెట్టు నరుడో! భాస్కరుడా, కన్నెర్రసేస్తివయ్యా నరుడో

భాస్కరుడా,''- అంటూ శివుడు అన్న రచయిత వ్రాసిన గేయం ఆనాడు నలుగురి నోళ్లలోనూ నలిగిన పాట. శ్రీకాకుళం గిరిజనోద్యమ నాయకుడైన సుబ్బారావు పాణిగ్రాహి "ఎరుపంటే కొందరికి భయం భయం, పసిపిల్లలు వారి కంటె నయం నయం'' - అంటూ ఎరుపును పోరాటానికి సంకేతంగా చిత్రించిన ఎరుపు అనే పాటల పుస్తకం ప్రచురింపబడింది.

దిగంబర కవులు రేపిన పెనుదుమారంతో తెలుగులో వచన కవిత మెరుగులు దిద్దుకొన్నది. మార్మిక కవిత్వాన్ని పరిహరించిన వీరి అభివ్యక్తి వచన కవితలో నెలకొన్న అస్పష్టతకు స్వస్తిచెప్పింది. నిస్సందేహంగా కవిత్వం అతి సామాన్యపాఠకుడి స్థాయిలోకి దిగి వచ్చింది.

అయితేనేం, దిగంబర కవిత్వోద్యమం మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. కొండను చేరేదాకా ప్రళయగర్జలు చేసి, కొమ్ముదాటగానే నిర్జీవమైపోయిన వర్షామేఘంలాగా దిగంబరకవిత కాలధర్మానికి అనతీతమైపోయింది.

కారణాలు చెప్పనక్కర లేదు. కవిత్వానికి ప్రాణభూతమైన రసాత్మకత మహోన్నత శిఖరాలను దిగంబరులు అధిరోహించలేక పోయారు. సంచారి భావాలైన నిర్వేదాదుల దాటి రసస్థాయిని చేరుకొనగల సన్నివేశాన్ని ఈకవులు కల్పించలేకపోయిన సంగతి స్పష్టమే. అవ్యవస్థకు, అసభ్యతకు దిగంబరగేయం రంగస్థలం అయింది. విరళంగా ప్రయోగించినప్పుడు హృదయాన్ని ద్రవింపజేసే సంఘటనలు అతిమాత్రమైపోయాయి. దానికి తోడు అంతర్నిహితమైన భావనాసూత్రానికి గుదిగుచ్చకుండానే మాటలను నోటికి వచ్చిన రీతిని ప్రయోగించి ఈ కవులు కల్పనను ఆసాంతం నిర్వహించలేకపోయి విఫలతను చవిచూశారు.

ఈ వైఫల్యానికి ఆలంకారిక దృక్పథం లేకపోవడం ఒక్కటే కారణం కాదు. అసలు నక్సలైటు ఉద్యమం, విప్లవ రచయితల ఆవిర్భావం మొదలైనవే దురవబోధ, అస్పష్టత ప్రాతిపదికగా ఏర్పడినవి. దానితో దిగంబరకవులు జుగుప్సావహమైన ధోరణిలో భావవ్యక్తీకరణ చేయడం అలవరుచుకొన్నారే గాని ప్రజలలో సామాజికస్పృహను కలిగించడానికి, ప్రజలకు విప్లవం పట్ల ఆభిముఖ్యం కల్పించడానికి, తాము వల్లెవేసిన మాటలకైనా చేతలలో రూపంచూపించిన శిల్పులు కాలేకపోయారు. తాము నమ్మిన సిద్ధాంతాల పట్ల పటిష్టమైన విశ్వాసం, వాటి సామంజస్యాన్ని గురించిన అవగాహన వీరికి నిర్ద్వంద్వంగా లేవని దీని అర్థం.
...తావేశం అధికమై సంకుచితత్వాన్ని అలవరుచుకొన్న వీరశైవులలాగా, శాక్తేయు...గా ప్రవర్తించి వీళ్ళు మళ్ళీ పూర్వపురోజులను గుర్తుచేశారు. ప్రజలలో తమ ...వలద్వారా కలిగిన చైతన్యం పరిణామక్రమాన్ని లక్ష్యంచేయక చుట్టూ గిరి...గాని ఈ కవులు పేరుప్రతిష్ఠలకోసం ప్రాకులాడిన ఘట్టం వీరి పరాజయా...దిదెబ్బ అయింది. కవితాస్థాయినుండి దిగజారి ఉద్యమం నినాదాలదశకు ...న్నది. ప్రచురణకర్తలు డబ్బు చేసుకోడానికి, రాజకీయ వాదులు పలుకుబడి ...దించు కొనడానికి సహాయభూతమై, వాళ్ళకు ఉత్సాహం తగ్గిపోతున్నకొదీ ...లోనూ వాస్తవిక జ్ఞానం ప్రవేశించి ఆవేశం తిరుగుముఖం పట్టింది. కవులు ...కులు ఈసంగతిని గుర్తించే సరికే దిగంబరకవిత్వం మఖనుదాటి పుబ్బను ...న్నది.

ట్రాజెడీకి మూలం

సొదుం రామ్మోహన్

ఆ మధ్య ఒక కథక మిత్రుడు కనిపిస్తే "కథలు రాయటం లేదేం?" అన్నాను. "రాయాలనే వుంది. కాని కథావస్తువు దొరికి చావడంలేదు" అన్నాడు. నాకు జాలేసి "అయితే నేనో ముడిసరుకు ఇస్తా. కథగా మలుస్తారా?" అన్నాను. అతను ఆశగా చెప్పండి అన్నాడు. నేనిలా చెప్పాను.

అనగనగా ఓ అమ్మాయి. కాలేజిలో చదువుతోంది. అందంగానే వుంటుంది. కానీ పాపం పేద కుటుంబంలో పుట్టింది. ఆ అమ్మాయి ఒక పెద్దింటి అబ్బాయిని ప్రేమించింది. కొన్నాళ్లకు మిత్రుల ప్రోత్సాహంతో వాళ్లిద్దరూ జామ్మని వెళ్లి గుళ్లో పెళ్లి చేసుకున్నారు. తరువాత ఈ విషయం అబ్బాయి తల్లిదండ్రులకు తెలిసి, ఆ అమ్మాయిని ఇంటికి పిలిపించి నానాతిట్లూ తిట్టారు. నువ్వు మా అబ్బాయిని వల్లో వేసుకున్నావు అన్నారు. కార్లలో తిరగొచ్చునని మా వెంగళప్ప మీద వలపు కురిపించి వల్లో వేసుకుని మా కొంపకు నిప్పంటించావు అన్నారు. కిందా మీదాపడి పెద్ద మనుషులే చిన్న మనుషులై, మొత్తానికి ఆ పెళ్లి రద్దు చేసుకునేట్టుగా ఆ అమ్మాయికి యాభై వేల రూపాయలు "నష్టపరిహారం" ఇచ్చేట్టుగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ అమ్మాయికి ఆ ఒప్పందం ఎంత మటుకు నచ్చిందో మనకైతే తెలీదు కానీ, అమ్మాయి తల్లిదండ్రులు మాత్రం దొరికిందే దోసకాయ ఒప్పేసుకోవే అన్నారట. ఆ అమ్మాయి ఒప్పుకుంది. ఠంచన్‌గా యాభై వేలు ఇచ్చారు. ఆ అబ్బాయికి మరో చోట పెళ్లి ఏర్పాటు చేశారు. రెండు లక్షలు కట్నం కొట్టారు. అది వేరే కథ. అసలు కథకొద్దాం.

ఈ అమ్మాయి ఆ యాభై వేలు వడ్డీలకు తిప్పుకుంటూ మద్రాసులో ఏదో ఉద్యోగం చేసుకుంటోంది. ఈ దశలో పాపం ఆ అమ్మాయిని ఒకరిద్దరు కుర్రాళ్లు "గాఢం"గానే ప్రేమించారు. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. నిజానికి ఆ ప్రేమించిన యువకులకి ఆ అమ్మాయి 'నష్టపరిహార సంపద' విషయం అసలు తెలీదట. అయితే ట్రాజెడీ యేమిటంటే, ఆ అమ్మాయి వాళ్ల చిత్తశుద్ధిని శంకిస్తున్నదట. ఎవరినో ఒకరిని చేసుకోవే అని తలిదండ్రులు చెప్తే "మీకు తెలీ మీరు నోరు మూసుకోండి. వీళ్లు నా డబ్బు కొట్టేయ్యాలని నన్ను ప్రేమిస్తున్నట్టు నటిస్తున్నారు. వీళ్ల వలలో నేను పడతానా?" అంటుందట ఆరిందాలా. ఆ అమ్మాయికి యాభై వేలు రావడంతోనే మనుషుల మీద, మనుషుల మీద విశ్వాసం పోయి సినిక్ అయిందన్న మాట.

ఆ కథకుడు కథంతా విని బుర్ర గోక్కుంటూ "ఇందులో క్లైమాక్స్

అన్నాడు.

"మీకు కథ రాయడం రాకపోతే, నే చేసేదేమీలేదు. కానీ ఇందులోని ట్రాజెడీని గమనించక పోవడం దారుణం. ఆధునిక జీవితంలో రచయితకు ఇంత కంటె గొప్ప ట్రాజెడీ దొరకదు" అన్నాను.

మన కథకులలో చాలా మంది 'ట్రాజెడీ' అంటే ఆఖరున ఎవరో ఒకరు చనిపోవడమే అనుకుంటున్నారు. చనిపోతే తప్ప ట్రాజెడీ (విషాదాంతం) కాదు అనుకుంటుంటారు. వర్తమాన జీవితంలోని విషాదాంతాలను పరిశీలించి అర్థం చేసుకునే శక్తి చాలా మందికి లేదు.

నిజానికి ఈనాడు "గ్రీకు ట్రాజెడీలు" మనకు తటస్థ పడక పోవచ్చు. కాలం మారేకొద్దీ ట్రాజెడీల స్వరూపం మారుతూంటుంది. కానైతే ఆనాడూ, ఈ నాడూ ట్రాజెడీలకు మూలం మాత్రం ఒకటే. ఆ మూలం ఏమిటంటే సామాజిక సంబంధాలు. అంటే వాస్తవమైన విషాదాంతానికి మూలం ఎప్పుడూ సామాజిక సంబంధాలే.

లైలా, మజ్నూ ప్రేమగాథ, సలీం, అనార్కలీ ప్రేమగాథ, రోమియో, జూలియట్ ప్రేమగాథ ఏవి తీసుకున్నా మనకీ విషయమే తెలుస్తుంది.

అనార్కలీ గనక ఏ రాచకుటుంబానికో చెందినదైతే ఆమె అంత అందంగా లేకపోయినా, అంత కళాత్మకంగా నృత్యం చేయక పోయినా, గానం చేయక పోయినా, అక్బరు కళ్లకద్దుకుని ఆమెను కోడలుగా తీసుకుని వుండు. అతనలా ఎందుకు చేయలేక పోయాడంటే, ఆనాటి సామాజిక సంబంధాల చట్రాన్ని వ్యతిరేకించ లేకపోయాడు. ఇంకొంచెం స్పష్టంగా చెప్పాలంటే వాళ్ల ప్రేమ మధ్య వారిరువురి వర్గ తారతమ్యం అడ్డుగోడగా నిల్చింది. వర్గాల తారతమ్యం అనే సామాజిక సంబంధాల చట్రం సలీం, అనార్కలీల పాలిట విషాదాంతంగా తయారైంది.

ఇప్పుడు మళ్లీ అసలు విషయానికి వద్దాం. మొదట చెప్పుకున్న కథలో ఆ అమ్మాయి తలిదండ్రులు గనక లక్షో, లక్షన్నరో కట్నం ఇవ్వగలిగివుంటే ఆ పెళ్లి రద్దై వుండేది కాదు.

ఒక్క ప్రేమ, పెళ్లి విషయంలోనే కాక ఇతర వ్యవహారాల్లో కూడా ఎక్కువ ట్రాజెడీలకు మూలం సామాజిక సంబంధాలే. కాస్త పరిశీలనగా చూస్తే ఈ విషయం బోధపడుతుంది.

ఉదాహరణకు మన మొదటి కథనే తీసుకుందాం. ఆ అమ్మాయి దగ్గర గనక ఆ యాభై వేలు లేకపోతే, అలా సినిక్‌గా తయారై వుండదు. ఎవర్నో ఒకరిని మళ్లీ ప్రేమించి హాయిగా పెళ్లి చేసుకుని వుండేది.

ఈనాటి మన జీవితాలలోని ఎక్కువ దుఃఖ పరిస్థితులకు మూలం సామాజిక సంబంధాలే. ప్రతి దుఃఖ భాజనాన్నీ విషాదాంతం (ట్రాజెడీ)గానే జమకట్టాలి. కథానాయకుడు కాని, కథానాయిక కానీ ఆఖరున చనిపోతేనే విషాదాంతం అనుకోనక్కర్లేదు.

కాస్త నిశితంగా పరిశీలిస్తే 'దేవదాసు' కథలో సైతం మనకి సామాజిక సంబంధాల స్వరూపం కనిపిస్తుంది.

దేవదాసుది టిపికల్ క్యారెక్టర్ అనే మాట వాస్తవమే కానీ అతనికున్న హాజం, జీవితంపట్ల, ఎదుటి వారిపట్ల నిర్లక్ష్యం, కాస్త రికామీతనం, నిలకడలేని మనస్తత్వం, ఎదుటి వారితో మాట్లాడేప్పుడు తూష్ణీంభావంతో ప్రవర్తించడం వగైరా గుణాలకు మూలం ఎక్కడుందంటారు? నేననుకోవడం అతను జమీందారీ బిడ్డ అయినందు వల్లనే ఆ గుణాలు సంక్రమించాయి, లేదా అలవడ్డాయి. దేవదాసు గొప్ప ప్రేమికుడే. కాదనలేము. అతని చిత్తశుద్ధిని కూడా శంకించలేము. కానీ, అతనికి పైన చెప్పిన గుణాలు వున్నాయనడం ఎంత వాస్తవమో, ఆ గుణాలకు అతను పుట్టి పెరిగిన పరిసరాలే మూలం అనడం కూడా అంతే వాస్తవం.

దేవదాసు జమీందారీ బిడ్డకాక, ఏ మధ్య తరగతి బిడ్డో అయివుంటే సాధారణంగా పైన చెప్పిన గుణాలూ వుండేవి కావు; పార్వతిని అతను దూరం చేసుకుని వుండే వాడూ కాదు. అయితే ప్రతి జమీందారీ బిడ్డలోనూ అలాటి గుణాలు తప్పని సరిగా వుంటాయని చెప్పడం అశాస్త్రీయం. ప్రతి మధ్య తరగతి యువకుడూ అలాటి గుణాలకు అతీతుడని కూడా చెప్పలేము. కాకపోతే జమీందారీ బిడ్డలో అలాటి గుణాలు పుట్టి పెరగడానికి ఎక్కువ అవకాశాలున్నాయి.

మనల్ని మొదటి నుంచి పట్టి పీడిస్తున్న సామాజిక సమస్యలలో కులం ఒకటి. మన సమాజంలో సామాజిక సంబంధాలలాగే కులం కూడా అప్పుడప్పుడు విషాదాన్ని సృష్టిస్తుండడం మనమెరిగిందే. ఒకే కులంలోని రెండు విభిన్న శాఖలకు చెందిన యువతీయువకుల పెళ్లిని కూడా ఆమోదించలేని తల్లిదండ్రులు ఇప్పటికీ వున్నారు.

కులం తెచ్చిన విషాదాంతాన్ని గురించి ఆలోచించినప్పుడల్లా, నా మనసులో ముప్పాళ రంగనాయకమ్మ రచించిన "బలిపీఠం" మెదుల్తూంటుంది. "బలిపీఠం"లో రెండు ప్రధాన లోపాలున్నాయనిపిస్తుంది. ఒకటి – దానిలోని నాయకుడు, నాయిక వర్ణాంతర వివాహం చేసుకుంటారు. అసలు ఏ వివాహానికైనా ప్రేమే పునాది. అది లేకపోతే వివాహం ఏదో ఒక మేరకు విఫలమయ్యే ప్రమాదం వుంది. గుండె జబ్బుతో చావడానికి సిద్ధంగా వున్న ఒక యువతిని మరో కులానికి చెందిన యువకుడు పెళ్లి చేసుకుంటాడు. పునిస్త్రీగా చావాలన్న ఆమె కోర్కెను తీర్చాలన్న ఉదాత్త భావంతో, అంటే ఆమె స్థితి మీద కేవలం జాలితో మాత్రమే అతనామెను పెళ్లి చేసుకుంటాడు. అలాకాక వారిరువురు గాఢంగా ప్రేమించి పెళ్లి చేసుకుని వుంటే చాలా సమస్యలను వారు పరిష్కరించు కోగలిగి వుందురేమో అనిపిస్తుంది.

ఇక రెండవ లోపం – ఆ నవల చదివితే వర్ణాంతర వివాహాలు సఫలం కావు అన్న అభిప్రాయం రచయిత్రికి వుందేమో అనిపిస్తుంది. అది సరైన అభిప్రాయం కాదు. రెండు కులాల మధ్య ముఖ్యంగా బ్రాహ్మణ, హరిజన కులాల మధ్య సంస్కార పరంగానూ, సాంప్రదాయాల పరంగానూ అంతరం వున్నదన్న

మాట నిజం. ఆ కారణంగా వైవాహిక జీవితంలో కొన్ని సమస్యలు తలెత్తే మాటా నిజమే. అయితే అభ్యుదయ రచయిత (విప్లవ రచయిత మరీనూ) అన్నవాడు వర్ణాంతర వివాహాలు విఫల మవుతాయని కానీ, అవి మన జీవితాలకు "బలిపీఠం" వంటివని కానీ చిత్రించడం దారుణం. "రెండు కులాల మధ్య ఉన్న "సాంస్కృతిక అంతరం" వల్ల వైవాహిక జీవనంలో ఎన్నో సమస్యలు తలెత్తుతాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కొంటే పరిష్కారమవుతాయి. "ధైర్యంగా ఎదుర్కోడానికి, కాసింత త్యాగానికి సిద్ధపడి వర్ణాంతర వివాహాలు చేసుకోండి" అన్న ధోరణిలో హెచ్చరిస్తూ రాయాలి తప్ప, వర్ణాంతర వివాహం మనల్ని దిగమింగే సుడిగుండం లాటివని చిత్రించడం పొరపాటనుకుంటా. ఎందుకంటే విఫలమైన వర్ణాంతర వివాహాల కంటె, విజయవంతమైనవే ఎక్కువ.

"ఉదయాద్రి"

కత్తి పద్మారావు

నీ మాటలు మంటలు కావాలంటే
నీలో స్వచ్ఛత పెరగాలి
నీ మాటలు ఈటెలు కావాలంటే
నీకు నిజాయితీ ఉండాలి
నీవు కావ్యశిల్పివి కావాలంటే
తిక్కన్నను పుక్కిటబట్టాలి
నీవు రసవాదివి కావాలంటే
కాళిదాసును చదవాలి
సూరన్న నెఱుగని నీవు
పాత్రనెలా సృష్టిస్తావ్
వేమన్న కబీరుల శక్తి నెఱుగ కుండానే
సూక్తి మౌక్తికాలేర్చే నవకవినంటావ్
గాలీబుని, నండూరిని
కృష్ణశాస్త్రిని, ఉమర్ ఖయాముని
ఉపాసించని నీవు
ప్రణయాన్ని ప్రవచించ లేవు
శ్రీ శ్రీ శబ్దాన్ని చూసి మురిసిపోతే చాలదు
ఆయన అంతరాంతరాల్లో రగిలే
సెగల మూలుగులు వినాలి.
సారస్వత సాగర మథనంలోనే
నవ్య కవితా సుధ సృజన జరుగుతుంది.
నీవను కొన్నట్లుగా
మండే గుండెను చూపాలంటే
పిడికిళ్లు బిగించి
కనుబొమలు విరిచి
పళ్లు నూరేస్తే చాలదు
మంటలు గంటలు
ఈటెలు బాకులు
బండలు గుండెలు
పేర్చి కూర్చినా చాలదు
నీవు మొండిగా అరిస్తే
నీ భావం బండగా వినిపిస్తుంది
అంత మాత్రాన
అమరాన్ని వర్జించమని కాని
భట్టుమూర్తిని బట్టీ పట్టమని కాని
నేననడం లేదు.
నీవు కవితల గనులు త్రవ్వనిదే
కొత్త బాటలు వేయలేవంటున్నాను.
నవత లేని కవిత
కవిత లేని నవత
నడపీనుగు లంటున్నాను.
అనంతమైన సత్యాన్ని దాటి చెప్పాలంటే
అంతర్ముఖుడవు కావాలంటున్నాను.

కథానిక 'పంజాబీ'

కిరసనూనె వాసన

అమృతా ప్రీతం

ముంగిట్లో గుర్రం ఇకిలింపు వినగానే, అది తన కన్నవారింటి నుంచి వచ్చిన గుర్రమని గులేరీ యిట్టే పోల్చుకొంది. ఒక్క క్షణం నిలువకుండా వీధిలోకి వచ్చి, ఆమె దాని మెడను చేతులతో చుట్టేసింది. దాన్ని అలా కౌగలించుకొన్నప్పుడల్లా, గులేరీకి తమను కన్నవారి యింటి ముంగిట్లో నిలబడిన అనుభూతి కలుగుతూ వుంటుంది.

గులేరి తల్లిదండ్రులది చాంబా గ్రామం. కొండకిటువైపున వున్న ఆమె అత్తవారి వూరికి చాంబా అట్టె దూరం లేదు. నిటారుగా వున్న కొండ దారిని బట్టి దిగువకు వెళితే చాంబా చేరుకోవచ్చు. ఇటు గ్రామం వెలుపలకు వచ్చి, ఒక ప్రత్యేక స్థలంలో నిలబడి చూస్తే దిగువన లోయలో చాంబా కనిపిస్తూనే వుంటుంది. గులేరికి పుట్టింటి మీద గుబులు పుట్టినప్పుడల్లా, తన భర్త మానిక్‌ను వెంటబెట్టుకొని అక్కడకు వెళ్లి సాయంత్రపు ఎండలో మిలమిలా మెరిసే తన చాంబా గ్రామాన్ని చూచి స్థిమితపడుతుండేది.

అత్త మామలు, ఏడాదికొకసారి, పంటల పండుగప్పుడు ఆమెను కొద్ది రోజుల పాటు కన వారింటికి పంపేవారు. పండుగ రెండు రోజులుందనగా చాంబా నుంచి, గులేరి తండ్రిగారి పాలేరు గుర్రం తోలుకొని ఈ గ్రామానికొచ్చేవాడు. పై వూళ్లలో మనువాడిన గులేరి బాగా చిన్నతనపు స్నేహితురాళ్లు మరో యిద్దరు కూడా పండక్కి తప్పనిసరిగా చాంబాకు వచ్చేవారు. ఈ ముగ్గురూ సంవత్సరం పొడువునా ఈ వార్షిక సమావేశం కోసం ఉత్సుకతతో ఎదురు చూస్తూ వుండేవారు. చాంబాలో వున్నన్నాళ్లూ వీళ్లు ముగ్గురూ ఒక్క క్షణం కూడా విడవకుండా అంటి పెట్టుకొని వుండే వాళ్లు. గంటల కొద్దీ కబుర్లు చెప్పుకొనేవారు. తమ తీయని అనుభవాలు, కష్ట సుఖాలూ అన్నీ అరమరికల్లేకుండా చెప్పుకొనేవారు. పండుగనాడు గ్రామంలో ఒక పెద్ద జాతర జరిగేది. చేతులకు కొత్త గాజులు తొడుక్కొని, చెవులకు వెండి పోగులు తగిలించుకొని, పండుగకు అద్దించుకున్న రంగు ఓణీలు వేసుకొని, వాళ్లు ముగ్గురూ ఆ రోజంతా వూరు చుట్టబెట్టి వచ్చేవాళ్లు.

గులేరీ అత్తవారి వూళ్లో వున్నప్పుడు పనిపాట్ల మధ్య కాస్త తీరిక చిక్కితే చాలు, పంటల పండుగ యికఎన్ని రోజులుందా అని లెక్కలు పెట్టుకొంటూ వుండేది. ఆకురాలుకాలపు గాలి తిరిగి వర్ష మేఘాలు చెదిరి పోనారంభించటంతో ఆమె యితర సంగతులేవీ అంతగా పట్టించుకోలేకపోయేది; చాంబా దృశ్యాలు ఆమె మనసును ఆవరించేవి. వంటా వార్పూ, పాలు పితకటం, గొడ్లకు మేతవెయ్యడం లాంటి నిత్యకృత్యాలు అయాయనిపించుకొని, ఆమె మళ్లీ రోజులు లెక్క పెట్టడంలో మునిగిపోయేది. తన తండ్రి పాలేరు యికరేపో, మాపో వచ్చి తీరుతాడని ఎదురు చూడనారంభించేది.

పండుగ మూడు నాలుగు రోజులుం దనగా ఆమె పుట్టింటి నుంచి నాథూ గుర్రం తోలుకొచ్చాడు. ఆ మరుసటి రోజు ప్రయాణం.

గులేరీ వన్నెత్తి మాట పలక్క పోయినా, ఆ సమయంలో ఆమె హృద యంలో చెలరేగుతున్న ఆనందాతి రేకం, ఆమె చేసే ప్రతి చిన్న పనిలో, ఆమె భర్త మానెక్‌కు అర్థం అవుతూనే వున్నవి. ఏ కారణానో మౌనంగా హుక్కా పీల్చుతూ మాటా మంతీ లేకుండా కూర్చుండి పోయాడు.

ఇక గులేరీ తనే వుండ బట్టలేక అతణ్ణి పలకరించింది.

"పండక్కి చాంబా వస్తావు కదూ? తప్పక రావాలి. ఆ ఒక్కరోజు వుండి వచ్చే యొచ్చులే" గులేరీ అంత గోముగా అడుగుతున్నా, మానెక్ మౌన సమా ధిలో నుంచి బైట పడలేదు.

"నిన్నే అడుగుతున్నది, జవాబు చెప్పవేం?" అంటూ గులేరి అసహనంగా రెట్టించింది: "నన్నే వాగమంటావా?" జవాబివ్వడం మానెక్‌కు తప్పని సరైంది.

"నీ మనసు నాకు తెలుసు .... ఏటా పండక్కు పోయిరమ్మని సాగనం పేవాడివి కదా, ఎన్నడూ వద్దన్న వాడవి కాదుకదా అంటావు"అన్నాడు.

"అదే అడుగుతున్నా..... ఈ సారి యిలా ఎందుకని" అని ఆమె అడిగేసింది. "అత్తగారు కూడా వెళ్లి రమ్మంది" అన్నది.

"వెళ్లి రమ్మన్నది కదూ.... మా అమ్మ....." మానిక్ ఏదో చెప్పబోయి, చెప్పలేక వూరకొన్నాడు.

* * *

మరుసటి రోజు గులేరీ చీకటి తోనే లేచి, యింటి పనులన్నీ చక్కబెట్టింది ఆమెకు పిల్లలు లేరు. అందుకని పని తెములక పోడం అంటూ ఆమె కింత వరకు ఏమీ లేదు. కరకర పొద్దుపొడిచే సరికల్లా ఆమె ప్రయాణానికి సిద్ధ మైంది. నాథూ గుర్రం తెచ్చి ముంగిట్లో నిలబెట్టాడు. గులేరీ అత్తమామల దగ్గర సెలవు తీసుకొంది. వారు కోడలి తలను తాకి క్షేమంగా పోయిరమ్మని ఆశీర్వ దించారు.

"పూరవల దాకా నేనూ వస్తా, పద" అంటూ మానెక్ ఆమె వెంట బయలుదే రాడు. మానెక్ ఈ మాటన్నందుకు గులేరీకి ఎంతో ఆనందమైంది. అతడు అప్పుడప్పుడు సరదాగా పొలంలోనూ, యింటి దగ్గరా కూడా వాయించే పిల్లన కర్ర ఓణీలో దాచుకొని ఉషారుగా బయలుదేరింది.

వారు నడుచు కొంటూ చాలా దూరం వెళ్లారు. అప్పుడు గులేరీ పిల్లన కర్ర తీసి, భర్త చేతికిస్తూ "ఒక్క సారి వూదు - వింటా" అంది. మానిక్ ఎటో చూస్తూ ఆమె మాట వినిపించు కోలేదు. "ఒక్కసారి వూదు... వినా లనిపిస్తూంది" అని అని గులేరీ గోముగా భర్తను ప్రాధేయ పడింది. మానిక్ దీనంగా ఆమె ముఖంలోకి చూస్తూ పిల్లన కర్రను పెదాల కానించు కొని యథాలాపంగా వూదాడు. భయాన కంగా వెలువడిన ఆ స్వరం విని గులేరీ ఉలిక్కిపడింది.

"గులేరీ, నీవు వెళ్ళకు" అన్నాడు మానెక్ అతి కష్టమ్మీద నోరు పెగుల్చు కొని.

"ఎందుకూ? జాతర రోజు నీవు

చాంబా వచ్చెయ్యి. ఇద్దరం కలిసి తిరిగి వచ్చేద్దాం.''

మానెక్ యిక నేమీ అనలేక పోయాడు. గులేరీ గుఱ్ఱ మెక్కి, పాలేరు వెంట బయలుదేరి పోయింది.

ఏడేళ్ల నాడు జరిగిన ఉదంతం మానెక్ మనసులో మెదిలింది. సరిగా పంటల పండుగ రోజునే అతడు, కొందరు స్నేహితులతో కలిసి చాంబా జాతరకు వెళ్ళాడు. అతడు గులేరిని మొట్టమొదట చూసింది అక్కడే. సంతలో జనం సరకులిచ్చి పుచ్చుకొంటున్నట్లే, వాళ్లు తమ హృదయాలిచ్చి పుచ్చు కొన్నారు.

అతడామె చేతిని నిమురుతూ, ''నీవు పాలు పోసుకున్న పచ్చి ధాన్యం కంకిలా వున్నావు'' అన్నాడు.

గులేరీ అతడి చేయిని వదిలించుకొని ''పచ్చికంకుల కెగబడేవి గొడ్లు. . . మనుషులు కాదు – నన్ను పెండ్లాడాలని వుంటే, మా నాయనను అడుగు'' అంది.

మానెక్ వాళ్ల కులంలో కన్యాశుల్కం వుంది. గులేరీ తండ్రి ఎంత అడుగుతాడో అని మానెక్‌కు ఆందోళన పట్టుకొంది. కాని గులేరీ తండ్రి బాగా వున్నవాడు, బస్తీల్లో వుండి వచ్చిన వాడూ కావటంతో ఆ చిక్కులేకుండా పోయింది. కన్యాశుల్కం తీసుకోరాదనీ, తగిన వరుణ్ణి చూచి తన బిడ్డ నివ్వాలనీ అతడు చాలా కాలం క్రిందటే నిర్ణయించు కొన్నాడు. మానెక్ అన్ని విధాలా గులేరీకి తగిన వాడేనని అతడు నిర్ణయించు కొన్నాడు. మానెక్, గులేరీ ఒక యింటి వాళ్లయారు.

గత స్మృతుల్లో ఒళ్లు మరచిన మానెక్ తన భార్య భుజం మీద చెయ్యి వేయడంతో మళ్లీ ఈ లోకంలోకి పూడి పడ్డాడు.

''ఏంటాలోచిస్తున్నావ్?'' అంటూ ఆవిడ అతన్ని అడిగింది.

అతను జవాబివ్వలేదు. గుఱ్ఱం అదే పనిగా సకిలిస్తోంది. గులేరీ తన ప్రయాణం గురించి ఆలోచిస్తూ, బయలు దేరడానికి లేచింది. ఇక్కడికి ''కోసెడు దూరంలో వున్న నీలపు గంట అడివి నువ్వెరుగుదువా?'' అని అడిగిందావిడ. ''దాని మధ్యనుంచి ఎవళ్లెళ్లినా, చెవిటి వాళ్లయి పోతారట''.

''అవును.''

''నువ్వు దాని మధ్య నుంచి వెళ్లి నట్టుగా వుంది. నేను చెప్పిందేమీ నీకు వినిపించడం లేదు.''

''గులేరీ, నిజం. నువ్వు చెప్పిందేమీ నాకు వినిపించడం లేదు'' అన్నాడు మానెక్ పెద్దగా నిట్టూర్చుతూ.

ఇద్దరూ ఒకళ్ల నొకళ్లు చూసుకున్నారు. ఒకరి మనసులో ఏ ముందో రెండో వారికి తెలియదు.

''ఇక వెళ్తాను. ఇంటికెళ్లు. చాలా దూరం వచ్చావు'' అంది మెల్లగా గులేరీ.

''చాలా దూరం నడిచావు గుఱ్ఱ మెక్కు'' అని జబాబిచ్చాడు మనెక్. ''ఇదిగో, నీ పిల్లన గ్రోవి తీసుకో''

''నీతో తీసు కెళ్లు.''

''సంత రోజు వొచ్చివాయిస్తావా?'' అనడిగింది, చిరునవ్వి గులేరి. ఆవిడ కళ్లలో ఎండ మెరిసింది. మనెక్ మొఖం తిప్పుకున్నాడు. గులెరీ కంగారు పడింది. చంబా దారి పట్టింది. మనెక్ యింటికెళ్లాడు.

ఇంట్లో కెళ్లి తన మంచం మీద

కూలపడ్డాడు.

"నువ్వెళ్లి చాలా సేపయ్యింది, చంబా కెళ్లావా?" అని తల్లి అడిగింది.

"అంతదాక కాదు! గుట్టపైదాకా". మనెక్ గొంతు బరువుగా వుంది.

"ముసల్దాన్లాగ గొణుగుతా వెందుకు?" అని వచ్చి తీవ్రంగా అడిగింది "మగాడివికావురా?"

మనెక్ గట్టిజబాబిద్దామనుకున్నాడు. "నువ్వు ఆడదానివి. ఆడదాన్లాగ ఒక సారి ఏడ్చి ఊరుకో!" అని అతను నిశ్శబ్దంగా ఊరుకున్నాడు.

వాళ్లకు పెళ్లయి ఏడేళ్లయ్యింది. గులేరీకి సంతానం లేదు. "ఎనిమిదేళ్లు దాటనివ్వన"ని మనెక్ తల్లి తనలో తాను తీర్మానించుకుంది.

ఈ ఏడాది, ఆవిడ తన నిర్ణయం ప్రకారం, అతనికి రెండో భార్యను తేవడం కోసం, ఐదు వందల రూపా యిలొకరికిచ్చింది. గులేరీ తన తలిదండ్రుల వద్దకు వెళ్లే సమయం కోసం ఆవిడ కాచుకొని వుంది, కొత్త పెళ్లి కూతుర్ని యింటికి తీసుకు రావడం కోసం. మనెక్‌కిది తెలుసు.

తల్లి మాటను, ఆచారాన్ని దాటలేక, మనెక్ శరీరం ఆకొత్త స్త్రీకి అలవాటు పడింది కాని అతనిలోనే అతని గుండె నశించిపోయింది.

* * *

ఒక రోజు బాగా పొద్దుటపూట అతను చిలుంకాలుస్తుంటె, ఒక పాత స్నేహితుడు ఆ దారి వెంట వెళ్తున్నాడు.

"వో! భవానీ, యింత పొద్దుటె ఎక్కడికెళ్తున్నావు?"

భవానీ ఆగాడు. అతని భుజం మీద చిన్న మూట వుంది. "ఎక్కడికీ లేదు" అని యిష్టం లేనట్లు జవాబు చెప్పాడు.

"ఎక్కడికో వెళ్తున్నావు గదరా" అన్నాడు మనెక్. "చిలుంకాలుస్తావా?"

భవానీ నడుంవంచి కూచుని మనెక్ చేతినుంచి చిలుం తీసుకున్నాడు.

"సంతకి చంబా వెళ్తున్నాను." అని చెప్పాడు చివరికి.

సూదుల్లా గుచ్చుకున్నాయి, భవానీ మాటలు మనెక్ గుండెల్లో. "సంత యీ పొద్దేనా?"

"ప్రతి ఏడాదీ యీ రోజే జరుగుతుంది" అని భవానీ పొడి మాటల్తో చెప్పాడు. "నీకు జ్ఞాపకం లేదా. ఏడేళ్ల క్రితం మనం అంతా కలిసి వెళ్లలేదూ?" భవానీ యింకేమీ అనలేదు. కాని మనెక్‌కు అతని ఎత్తిపొడుపు అర్థమయ్యింది. మనసు కష్టపెట్టుకున్నాడు. భవానీ చిలుం కిందను పెట్టి, తన మూటను తీసుకున్నాడు. పిల్లనకగ్ర మూట నుంచి తొంగిచూస్తోంది. వెళ్తానని చెప్పి భవానీ వెళ్లిపోయాడు. భవానీ కనుమరుగు అయ్యేదాకా మానెక్ కళ్లు ఆ పిల్లను కగ్రను చూస్తునే వున్నాయి.

మర్నాటి సాయంత్రం మనెక్ తన పొలంలో వుండగా, భవానీ తిరిగి వస్తూ కనిపించాడు. కాని కావాలనే యింకో వేపు చూస్తూ వుండి పోయాడు. భవానీతో మాట్లాడ్డం గాని, సంత గురించి ఏదీ వినడంగాని యిష్టంలేద తనికి. కాని భవానీ యింకో పక్కగా వచ్చి, మానెక్ ఎదుట కూచున్నాడు. ముఖం విచారంగ వుంది, కళారహితంగా.

"గులేరీ చచ్చిపోయింది" అని సూటిగా చెప్పాడు.

"ఎంటి?"

"నీ రెండో పెళ్లి సంగతి తెలిసేక మీద కిరసనాయిలు పోసుకొని నిప్పెట్టు కుంది"

మనెక్ బాధతో మూగవాడయి పోయాడు; తన బతుకే కాలిపోతూ వున్నట్టుగా తేరిచూస్తూ వుండిపోయాడు.

రోజులు గడిచి పోతున్నాయి, మనెక్ మళ్లీ పొలం పనులు చేసుకుంటు న్నాడు. పెడితే తిండి తింటున్నాడు. చచ్చిన వాడిలాగ వుంటున్నాడు, కళ లేని ముఖంతో, కాళీ కళ్లతో.

"నేను అతనికి భార్యను కాను. అతను ఎందుకో పెళ్ళాడిన ఎవర్తెనో" అని రెండో భార్య ఫిర్యాదు చేసింది.

కాని త్వరలోనే ఆమె సీళ్ళాడింది. మనెక్ తల్లి తన కోడలిని చూసుకొని సంబర పడింది. ఆవిడ కొడుక్కి అతని భార్య సంగతి చెప్పింది. కాని తనకు అర్థం కానట్టుగ చూదాడతను. అతని కళ్లు యింకా కాళీగానే వున్నాయి.

కోడలికి అత్తగారు కొద్ది రోజుల్లో నీ భర్త కోలుకుంటాడని ధైర్యం చెప్పింది. బిడ్డపుట్టగనే, వాడిని తండ్రి తొడమీద పెట్టే మారతాడని చెప్పింది.

మనెక్ భార్య మొగపిల్లవాడ్ని కన్నది. అతని తల్లి పరమానందంతో పిల్లవాడికి స్నానం చేయించి, వాడికి అందమైన బట్టలు వేసి, మనెక్ తొడ మీద వుంచింది. తన తొడ మీదనున్న పసిబిడ్డను మనెక్ తేరిపార చూశాడు. అతని ముఖం ఎప్పట్లాగనే అయోమయంగ వుంది. హటాత్తుగ అతని కళ్లలో భయం నిండి, మనెక్ అర వడం మొదలు పెట్టాడు.

"వీణ్ని తీసెయ్యండి!" అని పిచ్చి కేకలు వేశాడు. "తీసెయ్యండి! కిరసనా యిలు కంపు కొడుతున్నాడు!"

కలం మరమ్మత్తు

మానేపల్లి సత్యనారాయణ

నా చేతికి కలం వచ్చేసరికి
ప్రాచీన ఛందస్సులలో కందాల్లో
గీతాల్లో ఆ వగైరాల్లో
పద్యాలు రాసేది
మొదట్లో ఎంతమంచి కలం
అనుకున్నాను
కాని త్వరలోనే తెలిసింది
ఆ కలాన్ని మరమ్మత్తు చెయ్యాలని
మరమ్మత్తు చేశాను—
మాత్రా ఛందస్సులో రాయడం
మొదలెట్టింది
ఎంత బాగా మరమ్మత్తు
చేసుకోగలిగాను
ఇంక నా కలం వంటి కలమేలేదని
తెగ మురిసిపోయాను
కాని ఆ మురిపింపూ ఎక్కువ కాలం
మిగల్లేదు
బహుకష్టించి – ఎంతో అధ్యయనం
సహాయంతో
ఎందరో ప్రజాకవుల వెలుగులో
నా కలాన్ని మరామ్మత్తు చేశాను.
ఈసారి నా కలానికి పోలియే లేదు
సిరా కూడా మారిపోయింది
ఆశ్చర్యం! నా దస్తూరిలోనూ
ఎంతో మార్పు వచ్చింది
అవునవును నా మస్తిష్కంలో కూడా.
ఇప్పుడు నా కలం కొత్తగా
సరికొత్తగా తయారైంది
ప్రాచీన ఛందాల్లోనూ,
మాత్రా ఛందాల్లోనూ కాక
ప్రజాశ్రేయస్సు గమ్యంగా
సుబోధకత ధ్యేయంగా
కవిత రాయనారంభించాను

వీరేశలింగాన్ని గూర్చిన విమర్శలు

అక్కిరాజు రమాపతిరావు

వీరేశలింగం జన్మించి నూట ముప్పై సంవత్సరాలు గడిచాయి. ఆయన తనువు చాలించి కూడా ఏభై తొమ్మిది సంవత్సరాలు నిండబోతున్నాయి. తెలుగు దేశానికి, తెలుగు సాహిత్యానికి వీరేశలింగం ఏమిచ్చాడో, ఎటువంటి వికాసాన్ని కలిగించాడో బుద్ధిమంతులందరికీ తెలుసు. అయితే ఇటీవల కొందరు వీరేశలింగం జాతీయవాది కాడని, ఆయన జాతీయోద్యమంలో పాల్గొనలేదనీ ఆయన ఆధునికుడు కాడనీ ఆయన్ను తప్పు పట్టేవాళ్ళు బయలుదేరారు. వాళ్ళకు చారిత్రకావగాహన తక్కువని చెప్పాలి.

భారత జాతీయ కాంగ్రెసు పుట్టిన తర్వాత, మూడవ వార్షిక సమావేశం 1887 లో మద్రాసులో జరిగింది. దీనికి వీరేశలింగంగారు హాజరైనారు. 'దేశీయ మహాసభ – దాని ఉద్దేశములు' అనే వ్యాసాన్ని కూడా ఆ సభలో చదివారు. దాన్ని అచ్చువేసి ప్రతినిధులకు కూడా పంచిపెట్టారు. అందులో ఆయన స్పష్టంగా జాతీయ మహాసభ లక్ష్యాలన్నిటినీ సమర్థించారు. మానవజీవితంలో మాదిరిగానే శైశవదశ వెళ్ళి కౌమార దశ ప్రారంభమయ్యే సరికి, శరీరంలోనూ, మానసిక వికాసంలోనూ వచ్చే మార్పులు మాదిరిగానే, జాతీయ జీవనంలో కూడా ఇప్పుడు కాకపోయినా ముందు ముందు స్వాతంత్ర్య సంపాదన కాంక్ష పొడమవచ్చుననీ, అందులో తప్పులేదనీ, అప్పుడు రాజ్యాంగ విషయంగా సంస్కరణల కోసం ప్రయత్నం చేయవలసి వుంటుదనీ ఆయన భావించారు. ఆనాటి జాతీయ కాంగ్రెసు తీర్మానాలన్నిటినీ, పన్నులెక్కువ చేయకూడదు, ఉన్నతోద్యోగాలలో భారతీయులకు గౌరవప్రదమైన దామాషా ఉండాలనీ, గ్రామీణ పరిశ్రమలను అభివృద్ధి పరచాలని, ఇటువంటి వాటినన్నిటినీ తీవ్రంగా సమర్థించారు. ఇంచుమించు 1905వ సంవత్సరం వంగ దేశ విభజనం వరకూ కాంగ్రెసు యాజమాన్యమంతా మితవాదుల చేతులలోనే వుండేది. ప్రజా ప్రతినిధులు, శాసనసభలు, భారతదేశ పరిపాలన వ్యవస్థలో కూడా చోటు చేసుకోవాలని వీరేశలింగంగారు కోరారు. అయితే తమ కాలంలో ఇంగ్లీషు ప్రభుత్వం వల్ల దేశానికి కొన్ని సదుపాయాలు, సౌకర్యాలు, ప్రయోజనాలు చేకూరడం, ఆనాటి జాతీయవాదులైన మితవాదులందరి వలెనే ఆయన కూడా మరచి పోలేకపోయినాడు. ఇంగ్లీషు చదువు వల్లా, ఇంగ్లీషు వాళ్ళతోడి సంపర్కం వల్ల, దేశంలో భావసంచలనం ప్రారంభం కావడం ఆయన గుర్తించాడు. సంఘాన్ని సంస్కరించు కోవాలన్న కోరిక, మత సంబంధమైన సంస్కరణలు, ఇంగ్లీషు విద్యాభ్యాసం వల్లనే భారతదేశపు వివిధ ప్రాంతాలలో విద్యాధికులైన మేధావులలో సంచలనం కలగజేశాయి.

ఇంచుమించుగా 1920 వరకూ, అంటే బాలగంగాధర తిలక్ నుంచి

[illegible]
విస్పష్టమైన రెండు మార్గాలుండేవి. ఈ విధంగానే మతసంస్కరణోద్యమాలలోనూ రెండు విభిన్న దృక్పథాలుండేవి. బ్రాహ్మసమాజం, ఆర్యసమాజం, దివ్యజ్ఞాన సమాజాల దృక్పథాలలో ప్రాతిపదికంగానే దృక్పథ వైరుధ్యం ఉన్నది. అదే విధంగా జాతీయవాదులలో, సాంఘిక సంస్కర్తలలోను ప్రధానమైన రెండు వర్గాల వారుండేవారు. సంఘ సంస్కరణ విషయికంగా తీవ్రమైన సామాజిక పరివర్తనలు కోరేవారు, రాజకీయాందోళనల విషయమై మితవాదాన్ని, రాజకీయాలలో తీవ్రవాదులు, సాంఘిక సంస్కరణలలో సంప్రదాయాభినివేశ దృక్పథాన్ని ప్రదర్శించేవాళ్ళు. ఈ రెండు వర్గాలకు బాలగంగాధర తిలక్, గోపాలకృష్ణ గోఖలేలు ప్రాతినిధ్యం వహించేవారనవచ్చు. వీరేశలింగంగారి వ్యక్తిత్వం కొంత వరకు గోఖలే దృక్పథంతో సంవదిస్తుంది.

వీరేశలింగంపైన ఇంకొక విమర్శ ఏమంటే ఆయన సంఘ సంస్కరణ సిద్ధాంతాలు, శ్రుతిస్మృతి ఇతిహాస ప్రమాణాల ద్వారా సమర్థింప జూశాడనీ, ఆయన ఆధునికుడుకాడనీ! ఇది నిజం కాదు. గుడ్డివాడి చేతి దీపం, తనమీద ఇతరులు పడకుండా ఉండటానికి తోడ్పడినట్లు తాను శ్రుతి స్మృతులను చూపుతున్నానన్నాడు. తాను గుడ్డివాడూ కాడు. అవి దీపాలు కావు - అని ఆయన ఎన్నోచోట్ల, శ్రుతిస్మృతులను ఖండించే ఉన్నాడు. ఆధునికత అనేది కాలానికి సంబంధించింది కాదు. జ్ఞానానికి సంబంధించింది. ఈ కాలంలో మూడు వందల ఏళ్ల కిందటి విశ్వాసాలు, అభిప్రాయాలూ ఉన్నవాళ్ళున్నారు. కాలాన్ని బట్టే అయితే వేమన్న ఆధునికుడు కాడా? బసవేశ్వరుడు ఆధునికుడు కాడుగదా! మొదటి ప్రపంచ యుద్ధంతోనే హేతువాదం జగజ్జనావళిని ప్రభావితం చేసిందనీ, వీరేశలింగం హేతువాదాన్ని ప్రదర్శించ లేదనీ అనుకోవడం చాలా పొరపాటు. వీరేశలింగం జీవించి ఉన్న కాలాన్ని గుర్తుంచుకొంటే ఈ పొరపాటభిప్రాయాలకు తావుండదు.

నేను కవిని

'హర'

ఎక్కడ కన్నీళ్ళూ, బాధలూ
ఉంటాయో
అక్కడ నే నుంటాను -
ఎవరి కవోష్ణరుధిరాలూ, స్వేదాలూ
ఈ భూతలాన్ని బంగారం
చేస్తున్నప్పటికీ
వాళ్ళకింత కూడు,
వాళ్ళ బ్రతుకుల కింత నీడా
లేకుండా పోయిందో అక్కడ
వేదనతో మ్రగ్గుతోన్న వాళ్ళ
పిడికిళ్ళు తిరుగుబాటతో బిగియడానికి,
వాళ్ళ మనః క్షేత్రాల్లో బలిసిన,
అంధత్వపు
కంపతుప్పెల్ని నరకడంలో' పదునుసై
కొడవళ్ళు తెగడానికి
నేను అక్కడే ఉంటాను.

వాళ్ళ గుండెల్లో చైతన్యాన్ని రగిలిస్తూ,
వాళ్ళను విప్లవాల్లోకి నడిపిస్తూ
అక్కడే ఉంటాను నేను-
కవిని, నవ్యోషస్సితికా
భారవిని.

'కృష్ణాతీరం'
(ఒక పరిశీలన)
'సాహిత్య ప్రియుడు'

"కృష్ణాతీరం", కీ. శే. మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి "వందలాది కథా రచనలకు మకుటప్రాయ మనదగిన" నవల అని ప్రతీతి.

"'నీ కథకు నీతి ఏమిటి' అన్న ప్రశ్నకు ఆయన, 'దానికున్న దల్లా జాతి' అని జవాబు చెప్పిన గడసరి" అని దీని పునర్ముద్రణకు (ఎమెస్కో వారి ఆధునిక సాహిత్య అనర్ఘ రత్నం – 14) "మానసోల్లాసం" పేరుతో శ్రీ బి. నళినీకాంతరావు, శ్రీ పి. ఎస్. గోపాలకృష్ణ రాసిన ప్రవేశిక వెల్లడి చేస్తుంది; "ఆయన జాతి కథ కులు" అని ఉగ్గడిస్తూంది.

మల్లాది రామ కృష్ణ శాస్త్రి గారు అని వుంటే. అది నిజం గాగడుసుదనమే. జాతి అన్నది ఏక రూప జన సందోహం కాదు. అది పలువర్గాలతో, మన దేశంలోనైతే, ఆ వర్గాలకు పరివ్యాప్తమైన, పలు కులాలతో కూడిన బహు రూప సామాజిక వ్యవస్థ. జాతి కథా కథనం, ఈ వర్గాల, కులాల జీవిత స్రవంతి కంతటికీ అద్దం పట్టి తీరాలని కాదు. (అందుకు చాలా కథావస్తు బహళ వ్యాప్తి అవసరం.) కాని, ఒకానొక దృక్కోణంనుంచి దాని గతిక్రమాన్ని సమాహరించి చూపినా అది జాతి కథ కాగలదు.

ఉదాహరణకు ఒక వ్యక్తిని ఎంచుకొని, అతడు పరిసరాలను ప్రాభావితం చేస్తూ (ఇక్కడ పరిసరాలు వివిధ కులాలకు, వర్గాలకు చెందే వ్యక్తులు) వాటిచే ప్రాభావితమయే క్రమాన్ని చిత్రిస్తే అది ఆ జాతి బహుముఖ జీవిత ప్రతిబింబం కాగలదు.

రెండవ విషయం, జాతి అన్నది జడమైనది కాదు, గమనశీలమైనది. చారిత్రక పరిస్థితుల వల్ల ఒక్కొక్కప్పుడు దాని గమనం మందగించవచ్చు; వెనుక వట్టుకూడ పట్టవచ్చు. కాని చరిత్ర నడక ముందుకే గాని వెనక్కు కాదు; అందువల్ల, జాతిని ముందుకు నడిపిస్తున్న శక్తులేవో, వ్యక్తుల రూపంలో అవి ఎలా ఘర్షణ పడుతున్నవో చూపే కథను జాతి కథ అనాలి.

ఇదంతా కళాత్మకంగా, అంటే హృదయస్పంది అయిన ఘటనాక్రమ రూపంలో, పాత్రోన్మీలన రూపంలో వుండాలని వేరే చెప్ప పనిలేదు.

ఈ దృష్టితో పరికించినప్పుడు "కృష్ణాతీరం" జాతి కథా?

దీని ఇతివృత్తం, "మానసోల్లాస" కర్తలు చెబుతున్నట్లు వెనుకటి తరంలో "కృష్ణాతీరంలో, వెలనాటి వైదిక కుటుంబాల కష్టసుఖాలు."

ఆ కుటుంబా లెటువంటివి?

ఈ నవలలో కీలకపాత్ర అయిన అన్నప్ప శాస్త్రి స్మార్తం క్షుణ్ణంగా చదువుకొని, ఎరుగున్న వాళ్లకు పౌరోహిత్యం చేస్తూ, ఊళ్ళలో పురాణం చెబుతూ తద్వారా వచ్చే సంపాదన భూమి నుండి వచ్చే ఆదాయానికి తోడుకాగా హాయిగా

కాలక్షేపం చేసే వ్యక్తి. ఊరందరికీ తలలో నాల్కగా మెలిగే "సకల మంచి వాడు." ఇంత వరకు బాగానే వుంది. కాని, ఊరిలో ఎవరికో కాన్పు కష్టమై ఇంటిల్లిపాది లబో దిబో అంటున్నప్పుడు, అన్నప్ప తన మంత్రోదకంతో ఆమె గర్భవాసంలోని బిడ్డను మరుక్షణమే భూమిపై పడవేస్తాడు. నిగ్రహానుగ్రహ శక్తిగల "ఆనంద్‌జీ" అన్న కాశీ గోసాయి కటాక్షం పొందిన మాజీ సిపాయి చింతాలును కౌగలించుకొని "నాయనా, ఆ స్వామికి నీ మీద దయ వచ్చి, ఆ తరుణం వచ్చినపుడు ఈ అన్నప్పను మరచిపోకురా, నన్నక్కడకు చేర్చరా తండ్రీ" అని "విలవిలలాడి" పోతాడు. చింతాలు గంభీరంగా "అన్నప్పగారూ, నాలాటి అధముడే ఆ సొరగం కంట జూశాడే, మీకేం తక్కువౌతుందండీ, ఆనంద్‌జీ తప్పక రప్పించుకొంటాడు!" అన్నముక్కను వేదవాక్కుగా స్వీకరించి మురిసిపోతాడు. తనకు కనిపించిన కపిల గోవును సాక్షాత్తు దేవతా మూర్తిగా (ఆ ఆవు మందలోకి వస్తే కోడెలన్నీ దూరంగా వెళ్ళిపోతాయట), ఒక పదేళ్ళ పనిపిల్లను విజయవాడ కనకదుర్గ అవతారంగా నమ్మి నమస్కరించే మూఢవిశ్వాసి అన్నప్ప. (రచయిత పలు విషయాలపై తన అభిప్రాయాలను అన్నప్ప ముఖతః వెలిబుచ్చారన్న "మానసోల్లాస" కర్తల అభిప్రాయం సరియైనదే అని ఇక్కడ చెప్పవలసి వుంది.)

మరొక ఉదాహరణ, పిశుపాటి వారి కుటుంబం, తరతరాలుగా వస్తున్న మంత్రశాస్త్ర పారంగత్వానికి ప్రసిద్ధి. పిశుపాటి బుచ్చంభొట్లు దేవి ఉపాసకుడు. ఆయన నవరాత్రుల్లో దీక్షపట్టి పూజకు కూర్చుంటే, దేవి అందెల మోత ఘల్లు ఘల్లుమని అందరికీ విన్పిస్తుంది. పూజామందిరం ఘుమ ఘుమ లాడుతుంది. ఆయన లోకాతీతశక్తికి ఉదాహరణంగా రచయిత ఉట్టంకించే ఘటనలు ఇంకా కొన్ని వున్నాయి. ఆయన కొడుకు చిదంబరం కూడా మంత్రశాస్త్రంలో తండ్రి అంతటి వాడనిపించుకొన్నవాడు. ఘనాపాఠీ. ముందు తరానికి కూడా తరగని ఆస్తి వుండి, భజన పాళీ సంగీతం తప్ప మరో వ్యాసంగం లేని సోమరి జీవితం.

ఈ విధంగా శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాలను మానవ జ్ఞానానికి పరమావధిగా ఎంచుకొంటూ, మంత్రశక్తిపై మూఢ విశ్వాసాలతో తమ్ముతామూ, లోకాన్నీ కూడా తప్పు దారిని పెడుతూ, అది చాలదన్నట్లు, అంతకు మునుపటి కాలాన్ని తలచుకొని "ఆ కాలమే వేరు, ఆ మనుషులే వేరు" అని వాపోయే వైదిక బ్రాహ్మణ ఛాందసత్వం మన జాతి సంప్రదాయమన్న దృష్టితో రాసిన కథ జాతి కథ కాగలదా?

అయితే, ఆయనకు సంప్రదాయం మీద వల్లమాలిన మోజు అన్నంత మాత్రాన, ఆధునికత అంటే పడదని కాదు అని చెప్పడానికి ఉపోద్ఘాతం రచయితలు ఇచ్చిన పలు ఉదాహరణల్లో ప్రధాన మయినవి రెండు. ఒకటి, 40 ఎకరాల భూస్థితి ఉన్న అవధాన్లగారి అబ్బాయి సుబ్బారాయుడు చేసుకొనే "కులేతర" వివాహమూ, అందుకు అన్నప్పా, ఆయన సహధర్మచారిణీ, అవధాన్ల వియ్యపురాలూ వేసే ఆమోద ముద్రాను.

రెండవది, పొలం ఉమ్మడిగా దున్నుకోవడం, పండించుకోవడమే కాక, ఒకే వంటా, ఒకే పంక్తిన భోజనాలూ నిత్య జీవిత నియమంగా వుండే ఒక ఆదర్శ గ్రామాన్ని సీతారామాచార్లు అన్న ధన్వంతరి లాంటి వైద్యుని చలవ వలన, అవధాన్లగారి అల్లుడు రామశేషు నిర్మించడం.

మన ప్రాచీన భారతీయ సంప్రదాయమనే పేరున, బ్రాహ్మణ్యంలోని ఛాందసత్వాన్ని, "బ్రాహ్మణో మమ దేవతా" అని నమ్మే గంటయ్య వంటి మోతుబరి రైతులు మొదలుకొని సుబ్బన్న వంటి పాలేళ్ళ వరకూ గల తదితర కులాల వారి అజ్ఞానాన్నీ ఆదర్శప్రాయంగా చిత్రించే శ్రీ శాస్త్రిగారు ఈ రెండు "చోద్యాలని" ఈ కథలో ప్రవేశ పెట్టడానికి కారణమేమి ?

"కృష్ణాతీరం" కథ జరిగే నాటికి అంటే, బందరు నుండి విజయవాడకు ఇంకా రైలు పడక పూర్వం, మన సమాజ స్వభావమేమిటి? అది వలస పాలన లోని ఫ్యూడల్ సమాజం. ప్రధాన ఉత్పత్తి సాధనం భూమి. దానిపై యాజమాన్యం జమిందారులదీ, ఈ వ్యవస్థకు ఉపాంగమైన వడ్డీ, వ్యవసాయం, ముడిసరుకుల వ్యాపారులయిన మోతుబరి వర్తకులదీ, వీరందరినీ అంటిపెట్టుకొని జీవించే ఫ్యూడల్ వ్యవస్థ సిద్ధాంతకారులైన బ్రాహ్మణ్యానిదీ. వీరందరి విలాసైక జీవనం ఒక వైపు, మునుపటి స్వయంపోషక గ్రామ సాముదాయక వ్యవస్థ విచ్ఛిన్నమైన కారణాన, కులవృత్తులు శిథిలమై, కేవలం కూలీలుగా, పని మనుషులుగా, పాలేళ్ళుగా జీవితం వెళ్ళమార్చే ఇతర వర్గాలు, కులాలు మరో వైపు. అగ్రవర్ణాల దురహంకారం, జులుం ఒక వైపు; దానికి ప్రతిగా ఆత్మ రక్షణ కోసం రూపుగొన్న కింది కులాల వారి కుల కట్టుబాట్లు మరోవైపు.

ఈ సమాజంలో కొట్టవచ్చినట్లు కనిపించే అంశాలు రెండు: ఒకటి – ఈ దొంతరల సమాజంలోని అసమత్వాలు, రెండు – పై వర్గాలు కింది వాటిని దోచుక తినడం. మొదటిది సామాజికమైనది, రెండవది ఆర్థికమైనది. ఇవి పరస్పరం పెనవేసుకొన్న క్రమాలు. ఈ అసమతలలోని అన్యాయం, ఈ దోపిడిలోని క్రౌర్యం విద్యాధికుడూ, దయార్ద్రహృదయుడూ అయిన శాస్త్రి గారికి తెలియనివి కావు. ఫ్యూడల్ సమాజంలో స్వతఃసిద్ధంగావున్న ఈ సామాజిక, ఆర్థిక అన్యాయాలను రచయిత నిరసించడం లేదా అంటే నిరసిస్తున్నాడు. కాని, ఈ సమాజం నుంచి పుట్టి పెంపొందిన సంప్రదాయాలు, సిద్ధాంతాలు, ఆచారాలపట్ల ఆయనకున్న మోజు అపారమైనది. ఈ సమాజాన్ని నిర్మూలిస్తేనే తప్ప ఈ అన్యాయాలు తొలగవు. మరి ఈ సమాజం నిర్మూలనమయితే, తాము ప్రేమించే ఆచారాలు, సంప్రదాయాలు, సిద్ధాంతాలూ తుడిచి పెట్టుకుపోతాయి.

ఈ విషవలయం నుంచి బయటపడేందుకు ఆయన నిర్మించుకొన్న సోపానాలే ఈ వర్ణాంతర వివాహం, ఈ ఆదర్శ గ్రామమూ. మొదటిది సామాజిక అసమానతలను పరిష్కరించే మార్గం. ఆదిలో నాల్గు వర్ణాలు సమానమే, ఈ తేడాలూ, హెచ్చుతగ్గులూ మధ్యలో వచ్చినవే అన్న సూత్రీకరణతో ఈ వివాహాన్ని సమర్థించ ప్రయత్నిస్తున్నాడు. ఆదర్శ గ్రామ స్థాపన,

ఆర్థిక దోపిడీ సమస్యను పరిష్కరించే చిట్కా. పాత సంప్రదాయాల్లోని కుళ్ళును, కపటాన్ని, ఆ సమాజంలోని మోసాన్ని, క్రౌర్యాన్ని ఎండగట్టకుండా, వాటికి ఆలవాలమైన ఆ సమాజ పరిధిలోనే వాటిని పరిష్కరించే ప్రక్రియలు కనుకనే ఈ కులాంతర వివాహం, ఈ ఆదర్శగ్రామం ఈ కథావాతావరణలోం ఇముడ లేదు. అవి అవాస్తవికంగానే మిగిలి పోయాయి. ఆనాడు సంపన్న బ్రాహ్మణ యువకుడు రైతుబిడ్డను గుళ్ళో పెళ్ళి చేసుకోవడమన్న ఘటన ఆ వూరినే కాదు. చుట్టుపట్ల గ్రామాలకు గ్రామాలనే ఊపివేయ వలసిన ఘటన. ఎంతో సంచలనాన్ని, ఆవేశ కావేషాలను రెచ్చగొట్ట వలసిన ఘటన. అవధాన్లగారి అబ్బాయి తన సంభాషణా చాతుర్యంతో అందరి నోళ్ళూ మూయించి, వారిని ఒప్పించి చేసుకొన్న పెళ్ళిగా అది చిత్రింపబడటం, ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత అన్నప్ప శాస్త్రి, కారణాంతరాలవల్ల; ఆ దంపతులను వెళ్ళి పలకరించి ఎంతో ముచ్చట పడటమేకాక, వారింట్లో భోజనం చేయడం, ఆ వైదిక కుటుంబాల్లో ఆడవాళ్ళు సైతం ఆ పెళ్ళిలో తామే ముందున్నట్లు మాట్లాడటం - ఇదంతా ఒక యథార్థ ఘటనగా కాక, ఇలా జరిగితే ఎంత బాగుండుననన్న రచయిత ఆకాంక్షగా పాఠకునికి స్ఫురిస్తుంది.

ఇక ఆదర్శ గ్రామమందామా, అది సీతారామాచార్లు అనే సంపన్న గృహస్థూ, సాధువుగా మారిపోయిన మరో బ్రాహ్మణుడూ తమ భూమి ఇస్తే తప్ప అక్కడి కూలినాలి జనానికి భూమి లేకపోయె. వారిని కలసి దున్నుకోమనీ, కలసి వండుకొని తినమనీ (సోషలిజం కన్నా ఇది మరొక్క అడుగు ముందుకు వేయటమని శాస్త్రి గారు అనుకొన్నారేమో) బోధించేందుకూ, కట్టడి చేసేందుకూ మరో సంపన్న బ్రాహ్మణ యువకుడు అవసరమాయె. కింది వారి ప్రమేయం, చైతన్యం, పోరాటం అవసరమన్న స్పృహే లేని నేటి సినిమాలకూ, "కృష్ణాతీరం" లాంటి నవలలకే చెల్లు, భూమి సమస్యకు, సామాజిక పీడనా సమస్యకు ఇటువంటి పరిష్కారాలు. మన జాతి కథా గమనం ఇలా సాగలేదని ఈ 80 ఏళ్ళ చరిత్రే వేనోళ్ల చాటుతూంది.

పోతే శాస్త్రిగారు, ఆర్థిక సమస్యల బెడదలేని సంపన్న కుటుంబాల, ప్రత్యేకించి బ్రాహ్మణ కుటుంబాల దాంపత్య జీవితాన్ని చిత్రించే తీరు ముచ్చటగా వుంది. ఎందువల్లనంటే, అది సామాజిక బృహత్ సమస్యను పరిష్కరించే చిట్కా కాదు. తమకు పరిచితమైన జీవిత చిత్రణ. కాబట్టి వాస్తవికత ఉట్టిపడే ఘట్టాలు, తెలుగు పాఠక లోకాన్ని మురిపించే ఆయన తెలుగు నుడికారం, సంభాషణలు నడిపే చాతుర్యం, మనస్తత్వ పరిశీలన, మనల్ని ఆకట్టుకొనేది ఇటువంటివే.

ఈ నవలా సంవిధానంలోని లోపాలు బహుళంగానే ఉన్నాయి. కాని అవి ప్రస్తుతాంశం కాదు. చెప్పవచ్చినదేమంటే, "కృష్ణాతీరం" సామాజిక స్పృహతో రాసిన నవల కాదు. వెనుకటి వైదిక కుటుంబాల జీవితసరళిని ఒక విధమైన మమకారంతో చిత్రించిన నవల,

కథానిక

మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఛాందసుడు

శిఖామణికి పద్దెనిమిదేళ్ళుంటాయి. తూర్పు గోదావరి జిల్లాలోని ఓ పల్లెటూరి నుంచి వచ్చాడు ఆ పెళ్ళికి. ఇంటర్ పోవడంతో చదువు ఆగిపోయింది.

వాణిశ్రీకి పదిహేడేళ్ళు. అదే పెళ్ళికి హైద్రాబాద్ నుంచి వచ్చింది. తల్లి లేదు కాబట్టి అత్తయ్య దగ్గర గారాబంగా పెరుగుతోంది. లక్షణంగా మూడు పూటలా గాయిత్రీ జపం, సంధ్యా వందనం చేస్తున్న శిఖామణిని చూసి వాణిశ్రీ అత్తయ్య ముచ్చటపడింది.

ఆ కుర్రాడి కళ్ళు, ఆ అమ్మాయి కళ్ళు కలుసుకున్నాయి చాలాసార్లు. వాణిశ్రీ ధైర్యం చేయటం వల్ల ఇద్దరి చేతులు కలుసుకున్నాయి. చూడటానికి సీతలా కనిపించే వాణిశ్రీలో 'ద్రౌపది' కూడా ఉంది. అందుకే ధైర్యంగా శిఖామణి చెవిలోఅన్నది మెల్లగా.

"సాయింత్రం చీకటిపడేవేళకి గుడి వీధిలోని మా చినమామయ్య ఇంటికి రా అప్పుడక్కడ ఎవ్వరు వుండరు".

ఎందుకనో అనుకొన్నాడు ముందర. ఎందుకో తట్టగానే అదిరి పడ్డాడు. ఆ అమ్మాయి సాహసానికి అచ్చెరువొందాడు. వాణిశ్రీ అందం తలచుకొని ఆనందపడ్డాడు. ఆ అందంలోని మకరందాన్ని అందుకో వచ్చుననుకోగానే ఆ క్షణాల కోసం ఆత్రంగా చూడసాగారు.

వాణిశ్రీ చిన్న మాయచేసి చిన్న మామయ్య ఇంటి తాళంచెవి తీసుకొని గప్‌చిప్‌గా సాయంత్రం గుడిలోని ఆ యింటికి చేరుకొని శిఖామణి కోసం ఎదురు చూడసాగింది.

అరగంట గడిచింది. గంట గడిచింది. రెండుగంటలు గడిచాయి. శిఖామణి పత్తాలేడు. ఇంతలో మేనమామే వచ్చాడు. శిఖామణిని మనస్సులోనే శపిస్తూ పెళ్ళి ఇంటికి వెళ్ళింది వాణిశ్రీ.

శిఖామణిని వెదికి పట్టుకొంది.

"వస్తానని నమ్మించి, మోసంచేసి, చివరికి ఇదా నీవు చేసేది?" అంటూ మెత్తగా తిట్టింది.

ముక్కు గీక్కొని తల వంచుకొని చెప్పాడు శిఖామణి.

"మీ అత్తయ్య గోత్రం అడిగింది. రాబోయే ముందు మనిద్దరం సగోత్రీకులం అని తెలిసింది. గోత్రం కలిస్తే మనం అలాంటి తప్పులు చేయచ్చా? మనకిక పుట్టగతు లుంటాయా?"

ఏడవ లేక నవ్వింది వాణిశ్రీ

దారిద్ర్యం .... రాజీవి

కంటి చూపు లేదు కడుపుకన్నము లేదు
ఒంటినిండా మట్టి ఊదుపొట్ట.
అంటరాని తనము ఆ మహాశయునికే
కంటనీరు పెట్ట కరుణలేదో?
కన్ను కాననట్టి కటిక చీకటిలోన
మిన్ను పై బడినున్న మేఘ గర్జనలలో
అన్న మో రామయ్య అనుచు
అరిచాడొకడు
విన్నవారే సున్న విలయ ప్రపంచాన;
మూడునాళ్ళ నుండి ముద్దకైనా లేక
మూడునాళ్ళు కూడ ముడతపడియె;
ఏడనుంటివి సామి? ఎందుకుంటివి
రోయి;
చూడనైనా లేని చూపుమాంద్యము తోడ

హెన్రిక్ హైనె - కారల్ మార్క్స

కాట్రగడ్డ గంగయ్య

హెన్రిక్ హైనె (1797 - 1856) జర్మన్ సాహితీ జగత్తులో ఉద్దండుడు. ప్రజల నాడీ, వాడీ గ్రహించిన సాహిత్యకారుడుగా, సాహసవంతుడైన సామాజిక విమర్శకుడుగా, గొప్ప విప్లవ ప్రజాతంత్రవాదిగా ఆయనకు ప్రపంచ సాహిత్యంలో ఒక విశిష్ట స్థానముంది.

కారల్ మార్క్స (1818 - 1883)కు యీ మహాకవి పట్ల ఎంతో గౌరవ ముండేది. 18 ఏళ్ల ప్రాయంలో తనకు జెన్నీ (మార్క్స భార్య) పట్ల ప్రేమ అంకురించినప్పుడు మార్క్స రాసిన ప్రేమ గీతాల్లో హైనె ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. తరువాత చాలా ఏళ్లకు గాని వారి మధ్య పరిచయం యేర్పడలేదు.

1843లో మార్క్స సతీసమేతంగా (జెన్నిమార్క్స) పారిస్‌లో ప్రవాస జీవితం గడిపిన రోజుల్లో హైనె వారి యింటికి తరచు వెళ్తూ వుండేవారు. జర్మనీలో సెన్సార్, పోలీసు అధికారుల వేధింపు నుంచి తప్పించు కొనేందుకు హైనె 1831లోనే రాజకీయ ప్రవాసిగా పారిస్ వచ్చి అక్కడ స్థిరపడ్డారు. మార్క్స, హైనెల మధ్య సాన్నిహిత్యానికి కారణం రాజకీయమైనది. మార్క్స జర్మన్ - ఫ్రెంచి వార్షిక దర్శనిని ప్రకటించిన సందర్భంలో హైనెతో ఏర్పడిన పరిచయం వారి మధ్య గాఢమైత్రిగా వృద్ధి చెందింది. హైనె ఈ గ్రంథంలో మూడు పద్యాలు రాశారు. వీటిలో "లుద్విగ్ రాజ స్తవం" ఒకటి. అభివృద్ధి నిరోధకుడు అయిన బవేరియా రాజును నిశితమైన వ్యంగ్య ధోరణిలో విమర్శిస్తూ హైనె అల్లిన కవిత యిది. ఈ రచన ప్రష్యా పాలకులను ఎంతగా భయపెట్టిందంటే, జర్మన్ - ఫ్రెంచ్ సాహిత్యదర్శని వెలువడిన మరుక్షణమే ప్రష్యా అధికారులు తమ దేశంలో దానిపైని చర్య తీసుకున్నారు.

మార్క్స, ఆయన భార్య జెన్నీ ఉభయులూ రసపిపాస, సాహితీప్రజ్ఞ కలవారు కావటాన, హైనెతో, మార్క్స మైత్రి దిట్ట పడింది. తాము పరస్పరం అర్థం చేసుకోవడానికి కొద్ది మాటలు సరిపోయేవని ఒకసారి హైనె రాశారు. ఆయన యించుమించు ప్రతిరోజూ వీరి బసకు వచ్చి, వీరికి తన కవితలు వినిపిస్తూండేవారు. మార్క్స, హైనె గంటల తరబడి కూర్చుని ఆ కవితలను చర్చించి, అవి సర్వాంగ సుందరంగా రూపొందే వరకూ వాటికి మెరుగులు దిద్దు తుండేవారు. ఒక్కొక్కప్పుడు హైనె పత్రికలు తనపై చేస్తున్న అతిహేయమైన దాడులకు విపరీతంగా కుంగిపోతూ మార్క్స వద్దకు వచ్చేవారు. అలాంటప్పుడు జెన్నీ తన చతుర సంభాషణతో ఆయనకు వూరట కలిగిస్తుండేది.

హైనె మార్క్స దంపతుల బసకు తరచు వెళ్లేవారంటే, కేవలం సలహా

కోసం కాదు. అనేక సందర్భాల్లో ఆయన ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. ఒకనాడు హైనె వారి బసకు వెళ్లేటప్పటికి వారి పసిబిడ్డ ఒక రకమైన కింకల జబ్బుతో, కండరాలు బిగిసిపోయి గిలగిలలాడుతూ వుంది. మార్క్స్ దంపతులు ఏమీ పాలుపోక హైరాన పడిపోతున్నారు. వాళ్లనాస్థితిలో చూచిన హైనె, బిడ్డకు స్నానం చేయించాలి అంటూ కేకపెట్టి తానే అందుకు సన్నాహం చేసి, స్నానంచేయించి బిడ్డ ప్రాణం కాపాడారు.

కళాకారుడుగా హైనె అభివృద్ధికి మార్క్స్ స్నేహం గొప్ప దోహదం చేసింది. తన కవితల్లో "ఉత్కృష్టమైన రాజకీయాలు వూపిరి పోసుకో నారంభించాయి" అని హైనె 1844 ఫిబ్రవరిలో చెప్పారు. ఆ తదుపరి హైనె జర్మన్ సాహిత్యంలోని అత్యుత్తమ కళాఖండాలను సృష్టించారు. "జర్మనీ - ఒక శీతాకాలపు దేవతాగాథ" అన్న గేయాన్ని ఆయన రాసింది అప్పుడే. దానిని 'మహాకవిత' అని తానే అన్నారు. ప్రగాఢ జాతీయత, అతినిశితమైన వ్యంగ్యమూ, యదార్థ విషాదాత్మకమూ అయిన ఈ కవితలో ఆయన నాటి జర్మన్ ఫ్యూడల్ వ్యవస్థను చీల్చి చెండాడారు; జర్మన్ ప్రజా జీవితం నుంచి, పీడనలను, దారిద్ర్యాన్ని శాశ్వతంగా పెకలించి వేసే ఒక "నూతన జాతి" ఉద్భవించు తుందని ఆయన జోస్యం చెప్పారు. మన భూమ్మీద స్వర్గరాజ్యం స్థాపించ దలిచాము కాబట్టి, "నవగీతాన్ని", ఉత్తమ గీతాన్ని రచిస్తానని హైనె రాశారు.

విప్లవకారుడూ, శాస్త్రవేత్త అయిన కారల్ మార్క్స్, మహాకవి హైనె ఎంచుకున్న పోరాట సాధనాలు భిన్నమైనవి అయినప్పటికీ, వారి ఆశయం మాత్రం ఒక్కటే—తమ ప్రజలకు మరింత ఆనంద దాయకమయిన జీవితాన్ని సమకూర్చడం. హైనె శాస్త్రీయ కమ్యూనిజంను ఏనాడూ అవగతం చేసుకో లేకపోయారనే మాట నిజమే. ఆయన తన సమకాలీన పరిస్థితులను ఎంత నిశితంగా విమర్శించినప్పటికీ, భావి కమ్యూనిస్టు సమాజాన్ని గురించి తన అను మానాలను ఎన్నడూ పూర్తిగా అధిగమించ లేకపోయారు. అయినప్పటికీ ఆయనకు ప్రధానంగా మార్క్స్‌పట్ల, ఆయన అనుయాయులైన విప్లవకారులపట్ల గొప్ప ప్రశంసాభావ ముండేది. ఆయన వారి గురించి యిలా రాశారు. "రహస్యంగానో; కొంతగా చాటుగానో వుంటోన్న జర్మన్ కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు తర్కంలో దిట్టలు ... హెగెల్ సిద్ధాంతానికి వారు అత్యంత సమర్థులైన ప్రతి నిధులు. వారు నిస్సందేహంగా గొప్ప వివేకశాలులు, జర్మనీలోని అత్యంత శక్తిమంతులు. జర్మనీలో చైతన్యం గల వారెవరన్నా వున్నారంటే, వారు ఈ విప్లవనేతలూ, వారి అనుయాయులూనే. భవిష్యత్తు వారిదే నేమో".

1844 జూన్‌లో వేలాది సైలేషియా నేత కార్మికులు పెట్టుబడి దారీ వర్గ దోపిడీని ప్రతిఘటించిన కాలంలో, జర్మన్ ప్రజాసమరం తొలిసారి తారస్థాయి నందుకొంది. వారు మూడు రోజులపాటు ప్రాణాలకు తెగించి ప్రష్యా ముష్కర సైన్యంలో పోరాటం జరిపారు.

నేత పని వారి తిరుగుబాటుతో బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా శ్రామిక వర్గం తన శక్తివంతమైన, తిరుగులేని విప్లవ సమరాన్ని ప్రారంభించింది; చరిత్రాత్మకమైన తన హక్కులను ప్రకటించింది. అభివృద్ధి నిరోధక భూస్వామిక ప్రభుత్వంతో యింకా పోరాటం సాగిస్తోన్న జర్మన్ బూర్జువా వర్గం ఆ ప్రభుత్వానికే చెందిన సేననూ, పోలీసుల్ని తన రక్షణకు రప్పించుకొంది. వర్గ విభజన రేఖలు స్పష్టపడడం మొదలయింది. వీరి పోరాటాన్ని మార్క్స్ ప్రగాఢ శ్రద్ధాసక్తులతో గమనిస్తూ వచ్చారు.

"సైలేషియా నేత పనివారి" దుర్భర జీవితాన్ని వర్ణిస్తూ హైనె ఒక ప్రసిద్ధమైన కవిత రాశారు. అదొక అజరామరమైన కళాఖండం. అటువంటి పరిస్థితుల మీద తిరుగుబాటు చెయ్యమని ప్రతి పాఠకునికీ అదొక హెచ్చరిక.

ఆ రోజుల్లో దానిని కరపత్రంగా అచ్చువేసి జర్మనీ అంతటా పంచి పెట్టడం జరిగింది. దీనిలో హైనె సైలేషియా నేత పనివారు నేస్తున్నది పాత జర్మనీ శవానికి కప్పేందుకు దుప్పటి అని వారిచేత ప్రతిజ్ఞ చేయిస్తూ, జయిస్తున్న విప్లవ శ్రామిక వర్గశక్తిని ఆయన ప్రవక్తగా ప్రస్తావించారు. ఈ గేయం హైనె విప్లవ కవితల్లో విశిష్ట స్థానం అలంకరిస్తూ వుంది. ప్రపంచ రాజకీయ కవితా సాహిత్యంలో దానికి శాశ్వత స్థానం వుంది. దేశదేశాలలో అది ప్రతిధ్వనించినది.

నేత పనివాళ్లు. . . . , హెన్రిక్ హైనె

పొడిగానే వున్నాయి వాళ్ల కళ్లు
తడయితే దృష్టి ఆనదు కదా మరి
మగ్గం ముందర కూచున్నారు
పళ్లు పటపట కొరకుతున్నారు.
"ఓ జర్మనీ, నేస్తున్నాం నీ శవానికి
కప్పే వస్త్రం,
నేస్తున్నాం నీకో పెను శాపం
నేస్తున్నాం, నేస్తూనే వున్నాం!
"గజగజలాడించే శీతాకాలం చలిలో
ఆకలితో మలమలమాడి చస్తూ
మొరపెట్టుకుంటుంటే వినని దైవానికి
ఆశతో ఎంతగా వేడుకున్నా వర
మియ్యని వేల్పుకు
వంచించి, హింసించి, పరిహసించిన
దేవుడికి శాపం!
నేస్తున్నాం, నేస్తూనే వున్నాం!
"పేదల యాతనలు వినివిని విసుగెత్తి
దరిద్రపు గుడిసెల నుంచీ, బురద
గుంటల నుంచీ
పన్నులు గుంజే,
మమ్మ కుక్కలా వీధుల్లో కాల్చి చంపే
ధనికుల ప్రభువు రాజుకు శాపం.
నేస్తున్నాం, నేస్తూనే వున్నాం!
"అతి జిత్తులమారి అవినీతిని పెంచుతూ,
వికసించిక మునుపే పూలను నేల
రాల్చుతూ
కుళ్లలో, మురుగులో
పురుగులకు కొవ్వెక్కిస్తోన్న దేశానికి
మాదేమోనని మేమనుకున్న మాతృ
దేశానికి శాపం
నేస్తున్నాం, నేస్తూనే వున్నాం!
"కిరకిరలాడుతోన్న మగ్గం మీద
ఎగిరెగిరి పడుతోంది కండె
అహోరాత్రాలూ నేస్తున్నాం నీ పతనం
పాత జర్మనీ, నీ శవానికి కప్పే వస్త్రం
నేస్తున్నాం నీకోసం ఒక పెనుశాపం
నేస్తున్నాం, నేస్తూనే వున్నాం!

పెద్దోళ్ళ పెళ్ళి

కథానిక

వి. సాయిప్రభ

అప్పుడే నిద్రలోంచి మేల్కొంటున్న రాజకుమార్తెలాగా లైట్లలో పట్టణం వళ్ళు విరుచుకుంటుంది. ముగ్ధ మనోహరంగా ఆహ్లాదకరంగా ఉన్న ఆ సంధ్యా సమయంలో ఫిల్మ్ ఛాంబర్ రంగు రంగులుగా అలంకరించుకుంది. సామాన్య మానవుని జీవిత పరిమాణానికి కొంచెం ఎత్తుగా ఉన్న అవీధిలో ఫిల్మ్ ఛాంబర్ వీధికంతకూ గర్వంగా, ఠీవిగా తల ఎత్తుకుని చూస్తున్నట్టు దర్పంగా ఉంది.

సినిమా తారల ప్రారంభోత్సవాలూ, రాజకీయ నాయకుల ఉపన్యాసాలూ మంత్రుల సమావేశాలూ, ప్రఖ్యాత కళాకారుల ప్రదర్శనలూ, గొప్పగొప్ప వాళ్ళ వివాహాలూ ఫిల్మ్ ఛాంబర్‌లో జరుగుతాయి. అక్కడ అడుగు పెట్టాలంటే ఒక అంబాసిడర్ కారూ, రెండు అంతస్తుల మేడా, గంటకు వెయ్యి రూపాయిలు వేగంతో ఖర్చు పెట్టగల స్తోమతా సామాన్యమైన కనీసపు అర్హతలు.

ఆనాటి ఫిల్మ్ఛాంబర్ రంగు రంగులుగా రకరకాలు బల్బులతో మెరిసి పోతోంది. ఆక్కడ మోగుతున్న మంగళ వాద్యాలబట్టి అక్కడ వివాహం జరగ పోతోందని వీధిలో వెళ్తున్న వాళ్ళకి అర్థమవుతోంది.

ముహూర్తం తెల్లవారు ఝామున నాల్గు గంటలకు. అయినా దగ్గర వాళ్ళం, ఆప్తులం అంటూ వచ్చిన వాళ్ల కార్లతో ఆ వీధంతా నిండి పోయింది. ఖరీదయిన మనుషులు ఖరీదుగా కార్ల లోంచి దిగి, ఠీవిగా ఖరీదయిన వాతావరణంలోకి అడుగు పెడ్తున్నారు. పెళ్లి పెద్ద గజలక్ష్మి ఫిలిమ్స్ ప్రొడ్యూసర్ చక్రవర్తి, వచ్చిన పెద్ద మనుషుల్ని ఆడంబరంగా ఆహ్వానిస్తున్నాడు.

ఆహ్వానితులైన సినిమా తారలను చూడటానికి, రాబోయే మంత్రులతో స్వామికార్యం, స్వకార్యం కూడా నెరవేర్చు కుందామని వచ్చిన వాళ్ళతోనూ, రిపోర్టర్లతో నూ ఫోటోగ్రాఫర్ల తోనూ హాలంతా రొదగా ఉంది.

చక్రవర్తి ఒకవైపు అందరినీ ఆహ్వానిస్తున్నా, మరోవంక ముఖంలో ఆందోళన కనపడుతోంది. పెళ్ళికొడుకు తరుపున పెద్దలంతా పొద్దున్నే వచ్చేశారు. పెళ్ళికొడుకు ఇంకా రాలేదు. అత్యవసరమైన పనిమీద బొంబాయి వెళ్తున్నానని, నాకోసం ఎదురు చూడవద్దని, పెళ్ళి రోజుకి వస్తానని చెప్పి పెద్దల్ని పంపేశాడు. అతను చెప్పిన సమయం దాటి నాలుగు గంటలయింది. నిముషాలు గడుస్తున్న కొద్దీ చక్రవర్తి మనసులో ఆందోళన అధికమయింది.

ముఖ్యమయిన అతిధులందరూ వచ్చేస్తున్నారు. సినిమా తారలు, మంత్రులు ఒక్కొక్కళ్ళే వస్తున్నారు. వాళ్ళని చూడటానికి వచ్చిన వాళ్ళతో సందు లేకుండా హాలంతా కిటకిటలాడుతోంది. ఆహ్వానితులకు సదుపాయాలు చూడటా

నికి నియమింపబడిన సర్వీస్ బాయిస్ కూల్ డ్రింక్స్ పట్టుకుని హడావిడిగా తిరుగుతున్నారు.

చక్రవర్తి దృష్టి మాటిమాటికీ వాచ్ వైపు వెళ్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలందరినీ వారం రోజులపాటు నిశ్చింతగా పోషించ గల్గిన తన డబ్బు తన అదుర్దాని ఆవగింజంత కూడా సడలించలేకపోయింది.

చక్రవర్తిగారి అర్ధాంగి లక్ష్మీదేవి అచ్చంగా సినిమాలో లక్ష్మీదేవిలాగా రాళ్ళ నగలతో ధగధగా మెరిసిపోతూ, ఆయన దగ్గరికి హడావిడిగా వచ్చింది. ఆవిడ మొహంలో ఆదుర్దా, కంగారు స్పష్టంగా తెలుస్తోంది. "ఏమిటండీ ఇది?....అబ్బాయి ఇంకా రాలేదు? నాకేదో అనుమానంగా ఉంది." లక్ష్మీదేవి కంగారుగా అంది.

చక్రవర్తి తీక్షణంగా, కఠినంగా లక్ష్మీదేవి వంక చూసాడు. ఇంతలోకి పురోహితుడు కంగారుగా అక్కడికి వచ్చాడు. "అయ్యా! తమరిలా ఓసారి దయచేస్తారా?"....చక్రవర్తిని ప్రక్కకు పిలిచాడు.

కంఠం తగ్గించి మెల్లిగా చక్రవర్తితో అన్నాడు, రహస్యం చెపుతున్నట్టుగా. "బాబూ! కొంప మునిగేటట్టుగా ఉంది. ఆ అబ్బాయి ఇంకా పత్తా లేడు. వాళ్ళ తరఫున బంధువుల్లో అందరూ ఒకటే గుసగుసలుగా చెప్పుకుంటున్నారు. ఇదివరకు కూడా ఒకటి రెండు సార్లు ఇలాగే ముహూర్తం పెట్టించి కట్నం డబ్బు తీసుకుని అయిపులేకుండా వెళ్ళిపోయాడుట పెళ్ళికొడుకు. ఇదేం కొత్త కాదుగా అని అనుకుంటూ ఉంటే విన్నాను. నా మాట నమ్మండి బాబూ ఇందులో ఆవగింజలో అరపాలు కూడా అబద్ధం లేదు. విన్నది. విన్నది విన్నట్టు తమకి మనవి చేశాను. తమరు జాగ్రత్త తీసుకోండి.

పురోహితుడు చెప్పిన మాటలు విని చక్రవర్తి స్తంభించి పోయాడు. ఎంత దుర్మార్గం? .... వాళ్ళ మర్యాద మాటలు, వాళ్ళ దర్జా దర్పం చూసి ఎంత మోసపోయాడు? .... నిజంగా ఇది ఎంత అవమానం?... చక్రవర్తి మొహం అవమానంతో, రోషంతో, కోపంతో ఎఱ్ఱగా కందిపోయింది. ఏమీ మాట్లాడకుండా పెళ్ళికొడుకు తల్లిదండ్రుల దగ్గరికి నడిచాడు.

తన కెదురుగా కోపంగా నడిచి వస్తున్న చక్రవర్తిని చూసి పెళ్ళికొడుకు తండ్రి కంగారుపడ్డాడు. ఎఱ్ఱగా కంది ఉన్న చక్రవర్తి మొహం చూడగానే అతనికి సంగతంతా అర్థం అయిపోయింది. గబగబా లేచివచ్చి రెండు చేతూలూ పట్టుకున్నాడు. "బావ గారూ! మీరు మమ్మల్ని క్షమించాలి. ఆ దౌర్భాగ్యుడు ఇలా ముంచుతాడని కల్లో కూడా అనుకోలేదు. ముందరే రమ్మని ఎంత చెప్పినా సమయానికి దాటేశాడు. ఇలా జరుగుతుందని ఏమాత్రం ఊహించ గల్గినా మాతోపాటే రెక్కలు కట్టి తీసుకొచ్చే వాళ్ళం" అన్నాడు.

ఘాటుగా కడిగేయాలని కోపంగా వచ్చిన చక్రవర్తి దీనంగా ఉన్న ఈ మాటలు విని నీరుగారి పోయాడు. అతనిలో వివేకం తలెత్తింది. ఉన్న పరిస్థితి ఇది. దీనికి ప్రత్యామ్నాయం ఏదో ఆలోచించాలి కాని, రగడ పెట్టుకుంటే

ఇంతమందిలో పరువు పోవటం తప్ప మరేమీ లేదు.

టైం జరజరా పాకిపోతోంది. పెళ్ళి కొడుకు జాడలేదు. చక్రవర్తి ఏమీ తోచని వాడిలా దిగులుగా కూర్చు న్నాడు. అంతా రసభాస అవుతుందా? తనకు సరిగ్గా సరితూగగల సంబంధం కదా అని మిగతావన్నీ తోసిపుచ్చి ఈ సంబంధం కుదిర్చాడు. అంత జాగ్ర త్తగా వివరాలు సేకరించినా మోసపో యాడు తను? ... ఇప్పుడేం చేయ టం?.... ఒక్కగానొక్క కూతురి పెళ్ళి ఇలా అల్లరి పాలు కావల్సిందేనా?...

అప్పుడే వచ్చిన వాళ్ళల్లో గుస గుసలు బయలుదేరాయి. ఈ లగ్నం అగటానికి ఎంత మాత్రం వీలులేదు. కాని ఉన్నపళంగా పెళ్ళికొడుకు ఎక్కడ దొరుకుతాడు? ... చక్రవర్తి చిరాగ్గా పెదిమలు కొరుక్కున్నాడు.

లక్ష్మీదేవి గబగబా వచ్చింది, "ఏమండీ! ఏమిటి? ఏంచేద్దాం? అవ తల ఓ చెంప టైమయి పోతూంటే అలా కూర్చున్నారేమిటి?"

చక్రవర్తి విరుచుకు పడ్డాడు, "ఏం చెయ్యమంటావు నన్ను? ఓ తాడు తీసుకురా! ఇద్దరం కలిసి ఉరి పోసు కుందాం."

"ఏమండీ!" ... లక్ష్మీదేవి చెప్ప బోయేది ఆపేసి భయం భయంగా చూసింది.

"ఏమిటది? చెప్పు."

లక్ష్మీదేవి నోట్లోంచి భయంగా, మెల్లిగా వచ్చాయి మాటలు: "ఏమండీ! శంకరం బాబు ఎవరో స్నేహితుని పెళ్ళికని వచ్చి, ఈ ఊర్లోనే ఉన్నాడు. నిన్నను బజార్లో కనిపించి చెప్పాడు. మనం వెళ్ళి పరిస్థితి వివరించి కాళ్ళు పట్టుకుని బతిమాలితే కాదనడు. నా మాట వినండి. పట్టుదలకి పోతే, ఈ లగ్నం ఆగిపోతే – ఎంత అప్రదిష్టో ఇంతమందిలో – మీరే ఆలోచించండి."

చక్రవర్తి తుపాకీ దెబ్బ తిన్నవాడిలా చూశాడు. "ఏమిటీ! ఆ ముష్టి ఉద్యో గం తప్ప కానీకి గతిలేని శంకరానికి గజలక్ష్మి ఫిలిమ్స్ ప్రొడ్యూసర్ ఏకైక పుత్రిక నివ్వటమా? నీకేమైనా మతి పోయిందా?"

లక్ష్మీదేవి చక్రవర్తి మాటల్లోని వేడిని పట్టించుకోలేదు. నచ్చ చెపుతున్నట్టుగా అంది: "డబ్బు లేకపోతేనేమండి! పది తరాల వరకూ సరిపోయేంతగా మనకి లేదా? కుర్రాడు చందమామలా ఉం టాడు. మంచివాడు. ముఖ్యంగా అమ్మా యిని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. అన్ని విధాలా తగిన సంబంధం అని కుదుర్చుకున్నది ఇలా ఉంది కదా! అంతకంటె శంకరం ఎన్నో రెట్లు నయం. నేను ముందు నుండీ అంటూనే ఉన్నాను. నా మాట మీరు వినలేదు. ఇప్పటికయినా మించి పోలేదు. నా మాట విని శంకరం దగ్గరికి వెళ్దాం రండి."

చక్రవర్తి ఆలోచనలో పడ్డాడు; శంకరం హఠాత్తుగా మధ్యలో ఎక్కడి నుంచో ఊడిపడిన విలన్ ఏమీ కాదు. చక్రవర్తికి దూరపు చుట్టరికం ఉంది. పిల్లింటికి అడపా తడపా వచ్చి పోతూ ఉంటాడు. హైదరాబాద్‌లో ఏదో కంపెనీలో ఇంజనీరుగా పని చేస్తు న్నాడు. మంచివాడు. అందగాడు. ముందు తన కూతురు పద్మ ఇష్టపడితే తనే వీల్లేదని తోసిపుచ్చాడు. మేరు

పర్వతం మట్టి దిబ్బతో వియ్యమంద డమా? ...యాభై వేల రూపాయలు పెళ్ళి మండపం అలంకరణకి ఖర్చు పెట్టించిన తను యాభై రూపాయలు కూడా బాంక్ బాలన్సు లేని శంకరానికి కూతుర్ని ఇవ్వడమా? అహం అడ్డొచ్చింది

ఒక్క క్షణం కళ్ళెత్తి హాలంతా పర కాయించి చూశాడు. సంఘంలో పేరు ప్రతిష్టలుగల గొప్ప గొప్ప వాళ్ళంతా ఉన్నారు. ఈ పెళ్ళి ఆగిపోతే పోయిన పరువు మళ్ళీ సంపాదించుకోగలడా? ఒక్క కూతురి పెళ్ళి సరిగ్గా జరిపించ లేని అసమర్థుడని తనని అంతాఅనరూ?

చెయ్యి జారిపోబోతున్న పరువుని గట్టిగా పట్టుకుని లక్ష్మీదేవితో కారులో బయలు దేరాడు చక్రవర్తి.

శంకరం రెండు చేతులూ పట్టుకుని పరిస్థితి వివరించాడు, చక్రవర్తి.

ఒక్క క్షణం శంకరం కళ్ళల్లో అసహనం, పట్టుదల ప్రజ్వరిల్లాయి. ఒకానొకప్పుడు ఈ చక్రవర్తి దృష్టికి తను అనలేదు. ఇప్పుడు అవసరం కొద్దీ కాళ్ళ బేరానికి వచ్చాడు!

కాని అంతలో వెన్నెల లాంటి పద్మ జ్ఞాపకం వచ్చింది. తండ్రి నిరాదరణకు కూతుర్ని శిక్షించడం ఏం భావ్యం?... ఇంత అవసరంలోనూ ఇంకెవరో కాకుండా తనే గుర్తు వచ్చాడు కదా! చక్రవర్తి మనస్సులో తనకి కొంతయినా స్థానం ఉంది అనుకోవడానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలి?...

నిముషాల్లో ఏర్పాట్లన్నీ జరిగాయి.

"పెళ్ళికొడుకు మారిపోయాడు" అందరూ హడావిడిగా అనుకున్నారు.

చెక్కు చెదరకుండా గంభీరంగా లగ్నం జరిపిస్తున్నాడు చక్రవర్తి.

పాత పెళ్ళికొడుకు తరుపు వారు తెల్లబోయి చూస్తున్నారు పెళ్ళితంతు.

పాత పెళ్ళికొడుకు తరుపున వచ్చిన స్నేహితులు పెళ్ళికి ఉండటమా మాన టమా అని తికమక పడుతూంటే, పెళ్ళి కొడుకు మారినది కూడా గ్రహించని మంత్రులూ, సినిమా తారలూ ఆనం దంగా అక్షింతలు వధూవరుల నెత్తి మీదచల్లారు.

అబద్ధాల సంత....'స్రవంతి'

అన్నా! ఈసమాజ మొక
అబద్ధాల సంత!
అయితే ఈ బజారులో
నిజం కూడా దొరుకుతుంది
కాని, సజీవంగా మాత్రం కాదు
నిజాన్ని కబేళాలో తల నరికి
తల క్రిందులుగా కసాయి దుకాణంలో
వ్రేలాడదీసి
కత్తికొక కండగా కోసి
కణకణ మండే నిప్పుల్లో వ్రేల్చి
స్వార్థపు విస్కీతో
నంచుకు తింటున్నారు

వర్గాధిక్యత బారుల్లో
బారులు తీరి కూర్చున్న వాళ్లు!
క్షణమైనా తీరిక లేని పనితో
సతమతమౌతున్న సామాన్యుని
జీవితాన్ని కష్టాల కాష్టం మీదికెక్కించి
చలిగాచుకుంటున్నారు
నాగుబాములే
నాగస్వరాల నూది
పాములవాణ్ణి పట్టి కొట్టించి
బుట్టలో పెట్టేస్తున్నాయి
పడగెత్తుకొని పదవుల చుట్టూ
మ్యూజికల్ చైర్సు ఆడుతున్నాయి

కొంకణీ భాషలో కవిత్వ వికాసం

బి. బి. బోర్కర్

భారతీయ భాషలలో కెల్లా కొంకణి చాల మృదుమధురమైన భాష. రామ మనోహర లోహియా దానిని ఇటాలియన్‌తో పోల్చారు. మృత్యుముఖంలో వున్నప్పుడు కొంకణీ చెవిన బడ్డదంటే మరణాన్ని వాయిదా వేస్తానన్నారు కాకా సాహెబ్ కలేల్కర్. కొద్ది మాటలతో గొప్ప భావాన్ని సూచన ప్రాయంగా చెప్పగలగడం ఆ భాషలోని విశిష్టత. మామూలుగా మాట్లాడేటప్పుడు కూడా అలంకారాలతో మాట్లాడడం, సంకేతాలూ, వాక్చిత్రాలూ, సూచనలూ వుపయోగించడం ఆ భాషలో నరనరాల జీర్ణించిన అలవాటు. అక్షర జ్ఞానంలేని కొంకణీ ఆదివాసి కూడా మీ యింట్లో పెళ్లికి ఎదిగిన పిల్లవుందని విన్నాను - అనవలసి నప్పుడు మీ యింటనో పువ్వు వికసించి పరిమళాలు వెదచల్లుతూందను కొంటాను - అంటాడు. అది ఆ భాషలోని అలవాటు. అందుచేత అది కవితాత్మకంగా, లయాన్వితంగా వుండడంలో ఆశ్చర్యం లేదు. వేయి సంవత్సరాలకు పైనుంచీ కొంకణీ భాషలో పాటలు కట్టే అలవాటుంది. 13 వ శతాబ్దపు మహారాష్ట్ర భక్తకవి నామదేవుని పాటలో కొంతభాగం కొంకణీ భాషలో వుంది. అదే మొదటి కొంకణీ గీతం.

ఆ పాటలో అయిదుగురు గోపికలు తమ చీరలు తమకు ఇచ్చెయ్యమని కృష్ణుణ్ణి ప్రార్థిస్తారు. ఆ అయిదుగురూ అయిదు భాషల వాళ్లు; కన్నడ, మరాఠీ, హిందీ, కొంకణీ, గుజరాతీలలో వారు అభ్యర్థిస్తారు. ఆ పాటలోని ఒక పాదం కొంకణీ భాషలోవుంది.

మిగిలిన నాలుగు భాషల్లాగ కొంకణీ కూడ ఆనాటికి బాగా అభివృద్ధిపొంది వుందనడానికి ఇంత కన్నవేరే సాక్ష్యం అక్కర్లేదు. 16 వ శతాబ్దంలో కొంకణీ భాషకు వ్యాకరణం తయారుచేసిన థామస్ స్టీఫెన్స్ తన పుస్తకం కవులకు, వాగ్గేయకారులకు, పౌరాణికులకు ఎంతో ఉపయుక్తంగా వుంటుందన్న గొప్ప విశ్వాసం ప్రకటించేరు. దాని అర్థం ఒక్కటే. ఆ నాటికే కొంకణీ భాషలో గేయ కవితలు, పద్యాలు, పురాణాలు పుష్కలంగా వున్నాయనే. ఈ ప్రాచీన సాహిత్యాన్నంతనూ క్రైస్తవ మత ఉన్మాదులు ధ్వంసం చేశారనీ, కొంకణీ ప్రజల మేధకు, నైతిక సంస్కృతికి అపారనష్టం కలిగిందనీ పోర్చుగీసు ఉన్నత ప్రభుత్వోద్యోగీ, గొప్ప పండితుడూ అయిన కున్హారి వారా వ్రాశారు. ఈ మతోన్మాదులు కలిగించిన నష్టం ఇంతే కాదు. వారు సాగించిన దురంతాలను భరించలేక వేల సంఖ్యలో కొంకణీ ప్రజలు ఇరుగు పొరుగున వున్న మహారాష్ట్రం, కర్ణాటకం, కేరళ ప్రాంతాలకు పారిపోయేరు. ఇంక అక్కడ మిగిలి క్రైస్తవమతం తీసుకొన్న ప్రజలు మాతృభాషను వదలి పోర్చుగీసు భాషను స్వీకరించ వలసి వచ్చింది.

ఇతర భాషా ప్రాంతాలకు పారిపోయిన కొంకణీ ప్రజ, ముఖ్యంగా వారి లోని విద్యావంతులు విధిలేక తాము వుంటున్న ప్రాంతపు భాషను స్వీకరించి, దాని లోనే సాహిత్య సృష్టి చేశారు. కొంకణీ మూలబడింది. అక్షరజ్ఞానం లేని ప్రజా సామాన్యంలో మాత్రం అది మిగిలింది. ఆ పాత పాటలు, కథలు, పురాణాలు వారిలోనే మిగిలిపోయేయి. కొత్తవి ఏవన్నా వచ్చినా అవి వారి ఆనందాలూ, ఆవేశాలూ, కోపాలలో పుట్టినవే గాని, విద్యావంతులు ఎక్కడోగాని వాటివేపు చూడలేదు.

ఈ శతాబ్ది ప్రారంభంలో కొంకణీ భాషా పునరుజ్జీవన కృషి వుద్యమ రూపం ధరించింది. జానపదాలలో మిగిలివున్న కథా, కవితా సాహిత్యాన్ని సేకరించి, అధ్యయనం చేయడానికి ఎందరో పూనుకొన్నారు. డాక్టర్ జోసే పెరీరా ప్రొఫెసర్ లూసియో రోడ్రిగస్ ఇంకా ఎందరో. ఇంతవరకు 30 తరహాల కొంకణీ పాటల్ని పరిశీలించేరు. కథావస్తువు, మానసికోద్వేగం, మనః స్థితినిపట్టి ఈ పాటల లయగతులు, ఛందస్సులో మార్పు అపారంగా కనబడుతుంది. ఆ లయ, ఆ సంగీతం ఎరువు సొమ్ములు కావు. స్థానికంగా రూపొందేయి. అయితే వాటిలో పాశ్చాత్య సంగీతం, పాశ్చాత్య లయ గతుల ప్రభావం బాగా కనిపించేవి కూడా చాలా వున్నాయి. ఇతః పూర్వపు పోర్చుగీసు పాలకులు ఎన్ని దురంతాలు సాగించినా వారిలో మంచి ఒక్కటుందని చెప్పక తప్పదు. వారు సంగీత ప్రియులూ, వినోద ప్రియులూను. ప్రతి మత పాఠశాలలోనూ లాటిన్ సంగీతాన్ని ప్రవేశ పెట్టేరు. ఇది కాలక్రమేణా కొంకణీ గేయ సాహిత్యం అభివృద్ధి పొందడానికి అపారంగా సాయపడింది. ఈ నూతన సంగీతాన్ని జీర్ణించుకున్న అన్ని తరగతుల కవులూ పాశ్చాత్య లయను, ఛందస్సును స్వీకరించి దేశీయ ఛందస్సుకూ, లయకూ మేళవించేరు. ఈవిధంగా వుత్పన్నమైన వానిలో మండో, దేఖునీ, ధూల్పాద్ సుప్రసిద్ధం. ఇవి కొంకణీ కేథలిక్కులలో చాలా ప్రాచుర్యం పొందేయి. చక్కని స్వరసమ్మేళనం, మాధుర్యం కలిగి ఇట్టే ఆకట్టుకొంటాయి. ఈరాగ సమ్మేళనలో సినీమా, నాటకాల గీతాలు అసంఖ్యాకంగా వచ్చేయి. ఈ నూతన తరహా సంగీతాన్ని అవసరానుగుణంగా వుపయోగించడంలో సిద్ధహస్తులైన గోవన్ బ్యాండు మేళగాళ్లు ఈనాటి భారతీయ ఫిలిం సంగీతానికి ప్రాతిపదిక వేశారు. వివిధ ఛందస్సులలో ప్రస్తరింప చేయబడిన ఈ పాటలేగాక, నా చిన్నతనం రోజులలో కటాన్ ఛందస్సు అంటూ బాగా ప్రచారంలో వుండేది. ప్రజలు ఆసక్తి చూపే హాస్య ప్రధాన సంఘటనలనూ, పురాణ కథల్ని చెప్పడానికి దీనిని ప్రధానంగా వుపయోగించేవారు. లయ వున్నా ఇందులో పాదాలు కొన్ని పొడుగ్గా, కొన్ని పొట్టిగా వేగంతో కథనంలో వచనమే అన్నట్లు నడిచేవి. వర్తమాన కాలపు ప్రముఖ ఘటనల వర్ణనకు ఈ ఛందస్సు చాల అనుకూలంగా వుంటుందనీ, మంచి ప్రభావం కలిగించ గలదనీ నా అభిప్రాయం.

విద్యావంతులయిన కొంకణులు తాము వుంటున్న మహారాష్ట్ర, కన్నడ, మలయాళ భాషలలో రచనలు చేస్తూ ప్రసిద్ధిపొందినా, మధ్య మధ్య కొంకణీలో

కూడ చక్కని రచనలు చేశారు. ఆ విధంగా వ్రాసేప్పుడు వారు తాము నివసిస్తున్న భాషా ప్రజల ఛందస్సులూ, లయలూ వుపయోగిస్తూవచ్చేరు; కృష్ణభట్ట బండార్కర్, ఎం. గోవింద పాయ్, ఆనందరావ్ బెహాబెట్, శ్రీశివరామాశ్రమ్ స్వామి, మంగేష్ రావ్ తెలాంగ్ ఈ సందర్భంలో సంస్మరణీయులు.

అయితే 1946 లో డాక్టర్ రామ మనోహర లోహియా ప్రారంభించిన గోవా విమోచనోద్యమంతో కొంకణీ కవితా వికాసం నిజంగా ప్రారంభమయిందని చెప్పాలి. ఈ వుద్యమంలో కొంకణీ ప్రజ ఆత్మవ్యక్తీకరణకు సాహిత్య ప్రక్రియలన్నింటినీ వుపయోగించు కొంది. ముఖ్యంగా కవితలూ, గేయాలూ అసంఖ్యాకంగా వచ్చేయి. అంతవరకు పాత, కొత్త మరాఠీ ఛందస్సులలో కవితలు వ్రాసిన బోర్కార్ మొదట్లోనే ఈ వుద్యమంలోకి వురికేడు. ఆ వుద్యమపు ఆశయాల వుత్తేజంతో అనేక మహారాష్ట్ర ఛందస్సులను తోడు తెచ్చుకొన్నాడు. ఆ అనుభవం ఇచ్చిన వుత్సాహంతో ఆయన హిందీ, గుజరాతీ, బెంగాలీ మొదలైన భాషలలోని ఛందస్సులను వినియోగించుకొని కొంకణీ భాషలో ప్రేమగీతాలు మొదలైనవి అసంఖ్యాకంగా వ్రాసేడు. సంస్కృత ఛందస్సులోనే భగవద్గీతను కొంకణిలోకి అనువదించాడు. ఆయన తరువాత డా. మనోహరరావు సర్దేశాయి ప్రారంభంలో సాంప్రదాయిక ఛందస్సులోనే కవిత ప్రారంభించేరు. కాని త్వరలోనే తాము విద్యాభ్యాసం చేసిన పారిస్ ప్రభావంతో ఫ్రీవెర్స్‌లోకి దిగిపోయేరు. అందులో ఆయన అసాధారణ నైపుణ్యం, గొప్ప శిల్పం కనబరిచారు. తర్వాత వచ్చిన డాక్టర్ ఆర్. వి. పండిట్ సహజ తిరుగుబాటు ధోరణిలో ఈ ఫ్రీవెర్స్ రచనను సమాజంలోని పీడిత, తాడిత ప్రజల ఆవేదనల ప్రకటనకు సమర్థవంతంగా వుపయోగించారు. కొంకణీ సాహిత్యంలోని సామాజిక వస్తువు నూతన విస్తృతిని పొందింది.

ఈ ప్రముఖ కొంకణీ కవులు ముగ్గురూ అపారంగా వ్రాయడమే కాదు, ఛందస్సులలో నూతన ప్రయోగాలు కూడా ఎన్నెన్నో చేశారు. వారి నుంచి పొందిన వుత్సాహంతో అనేక మంది యువకవులు బయలుదేరేరు. అన్ని వర్గాలూ, తరగతులూ, కులాల నుంచి వచ్చిన వీరంతా అధిక భాగం ఫ్రీవెర్స్‌నే భావవ్యక్తీకరణకు వుపయోగిస్తున్నారు. ఈ నవకవులలో పుండరీక నాయక్‌కు మంచి భవిష్యత్తువుంది. ఇటీవల ఆయన కవిత ఒకటి చూశా. ఫ్రీవెర్స్‌కు ఇతోధిక విస్తరణావకాశా లున్నాయనిపించింది, దానిని చూసి నప్పుడు. ఆధునిక జీవితపు వేగమూ, తారళ్యమూ తమ ఛందశ్శిల్పాన్ని గట్టిపరచు కొనేందుకు అవకాశం కలిగించడం లేదో, యేమో.

విద్యావంతుల దృష్టి కవిత్వం మీదా, ఫ్రీవెర్స్ మీదావుంది. కాని గ్రామీణ ప్రజల అభిమానం పాటలూ, పదాలూ మీద. వానిని సమకూర్చే గ్రామీణ కవులు అసంఖ్యాకంగా వున్నారు. గత పది శతాబ్దాలుగా కొంకణీ భాషా కవితలలో సాగుతున్న ఛందః పరిణామాల సంగ్రహ చరిత్ర ఇది.

('ఇండియన్ లిటరేచర్' 1978 మార్చి - ఏప్రిల్ సంచిక నుంచి)

తెల్ల మొహం

కథానిక

జాక్ లండన్

యురోపు రాజధానులకు చేరు కోవాలని బయలు దేరిన సబిన్‌కోవ్ ఎక్కడో మారుమూల రష్యన్ అమెరికాలో తేలేడు. అక్కడితో ముగిసింది, అతని ప్రయాణం. చేతులు విరిచికట్టి, మంచులో కూలేసేరు. ఎదురుగా భీమాకారుడైన కోసక్కు బాధతో మూలుగుతూ బోర్లాపడి వున్నాడు. మగవాళ్ల పని అయింది. ఆడవాళ్లకి వప్పచెప్పేరు. వాళ్లు క్రౌర్యంలో తమరినీ మించి పోయారన్న ఆనందం మగవాళ్ల కేకల్లో వినిపిస్తూంది. ఇంక తనదీ వంతు.

సబిన్‌కోవ్ వణికి పోయాడు. చావంటే భయంతో కాదు. చిత్ర హింస అంటే అతనికి నచ్చదు. ఆ భయం బాధ గురించి కాదు. తనకు ముందు చిత్ర హింసకు గురి అయిన వాళ్లందరి లాగా బతిమాలడం, బామాలడం, గిడ గిడ లాడడం — అదేమీ బాగో లేదు. నవ్వుతూ, హాస్యాలాడుతూ చావాలి గాని, కేకలెయ్యడం, కోతిలా గిడ గిడ లాడడం చాలా భయంకరం.

పోలండ్ స్వాతంత్ర్యంకోసం కలలు కన్ననాటి నుండి అతడు విధిచేతి కీలుబొమ్మయ్యాడు. వార్సా, సెయింట్ పీటర్స్‌బర్గ్, సైబీరియన్ గనులు, కామాచత్కాబొచ్చు చర్మాల పడవలు — చివరకి "మలాతో" వరకూ విధి తరుము కొచ్చింది. మరి తప్పించుకొనే దారి లేదు.

కోసక్కు ఇవాన్‌ది భారీ విగ్రహం. ఉక్కు మనిషి. విపరీతమైన నరాల పటుత్వం. అలాంటివాడి అంతు కనుక్కున్నారు, మలాతో ఇండియన్లు. కాని ప్రాణం పోలేదు. ఆ నరాల పటుత్వానికి శిక్ష అనుభవిస్తున్నాడు.

కోసక్ కేకలు ఇంక వినలేడు. అతడు చచ్చిపోయేక తనవంతు. యకాగా కనిపెట్టుకు నున్నాడు. వారం క్రితం కోటలోంచి కొట్టి తరిమేసి నందుకు కసి తీర్చు కోవాలని కూర్చు న్నాడు. చిత్రవిచిత్రాలైన హింసా పద్ధతు లాలోచిస్తూ వుంటాడు. ఇవాన్ వెర్రికేక పెట్టేడు. ఇండియన్ ఆడవాళ్లు విరగబడి నవ్వుతూ, చప్పట్లు కొడుతున్నారు. వాళ్లు చేసిన ఘోరానికీ, ఆ నవ్వులకీ సబిన్‌కోవ్ తానూ వెర్రిగా నవ్వేస్తున్నాడు. ఆ నవ్వు చూసి ఇండియన్లు ఆశ్చర్యంగా చూస్తున్నారు. అయినా అతడు నవ్వుతునే ఉన్నాడు.

సబిన్‌కోవ్ తెలివి తెచ్చుకొని నవ్వు ఆపేడు. ఇతరేతర విషయాల మీద మనస్సు మళ్లించాలని, తన గత జీవితం అంతా నెమరువేసుకో సాగేడు. తల్లి, తండ్రి, చిన్న నాటి ఫ్రెంచి ట్యూటరు, నలిగి మాసిపోయిన వాల్టేర్ రచన, పారిసు, లండను, వియన్నా, రోమ్. వార్సా గద్దెపై పోలండ్ రాజును కూర్చోబెట్టాలని కలలుగన్న తమ జట్టు కంతకీ మిగిలింది తానొక్కడే. సెంట్ పీటర్స్‌బర్గ్‌లో మరణ శిక్ష పొందిన ఇద్దరితో ప్రారంభమై, ఒక్కొక్కరే ఒక్కొక్కరే. ఒకరిని జైలరు కొట్టి చంపేసేడు. సైబీరియా దారిలో, గనుల్లో, కొరడా దెబ్బలకి ఒక్కొక్కరే చచ్చి పోయేరు.

మహా క్రూరమైన హింసలు. తప్పించుకున్న ముగ్గురిలో ఇద్దరు కోసక్కుల తుపాకులకు గురి అయ్యారు. తాను మాత్రం దారిలో ఎదురైన ఓ బాటసారిని చంపేసి, అతని డబ్బూ, కాగితాలూ తీసుకొని కామాచట్కా చేరేడు.

నాటకాలూ, సంగీతాలూ, దర్బార్లు గురించి కలలు కంటూనే వున్నాడు. కాని, జీవితం మహాక్రౌర్యాలు, దుర్ణయాల మధ్యనే గడుస్తూంది, ఇన్నాళ్లూ. పాస్‌పోర్ట్ కోసం ఓ బాటసారిని చంపేసేడు. ఒక్క రోజున తానూ మనిషినే అని రుజువు చేసుకొనేందుకు ఇద్దరు రష్యన్ ఆఫీసర్లని ద్వంద్వయుద్ధంలో కాల్చి చంపేసేడు. తోళ్ల దొంగలతో చేరి సైబీరియా నుంచి వేల మైళ్ల ప్రయాణం చేసేడు. బెరింగ్ జలసంధి మంచు దిబ్బలు దాటి అలాస్కా చేరేడు. ఈ లోపున ఎంత హింసాకాండ. ఎన్ని రోగాలు. ఎన్ని చావులు.

యూరపు రాజధానులకి చేరుకోవాలన్న ఆశ. కాని వెనక్కి వెళ్లలేడు. వెడితే గనులు, కొరడాలు తన కోసం ఎదురు చూస్తున్నాయి.

ఓడలు మారేడు. కాని అక్కడే ఆ ప్రపంచంలోనే తిరుగుతున్నాడు. స్లావ్ వేటగాళ్లు, రష్యన్ దుస్తుల మంగోలులు, తార్తారులు, సైబీరియన్లు, ఆదివాసులు, అతని సహచరులు. తోళ్లు, చర్మాలు ఇవ్వనందుకు గ్రామాలకి గ్రామాల్ని తాము నాశనంచేశారు. తమరిని చంపి ఓడలవాళ్లు ఆ చర్మాలు లాక్కున్నారు. తానూ, ఒక ఫిన్ జాతివాడు ఆ హత్యాకాండనుంచి తప్పించుకొని ఒక జనశూన్యమైన అల్యూషియన్ దీవిలో ఒక శీతాకాలం అంతా గడిపేరు. వసంతంలో యాదృచ్ఛికంగా అటు వచ్చిన తోళ్ల పడవలో బయట పడ్డారు.

ఓడలూ, పడవలూ మారుతూ అలాస్కానుంచి కాలిఫోర్నియా వరకూ తీరం

కథకుని గురించి

దారిద్ర్యం, మానసిక వ్యథలు, శారీరక బాధలను అధిగమించి, తన్నొక మహా రచయితగా తీర్చిదిద్దుకొన్న మహావ్యక్తి జాక్ లండన్. జీవించిన 41 ఏళ్లలో (1876 – 1916) ఆయన అపార జీవితానుభవం గడించేరు. ఎన్నో రచనలు చేశారు. తన కాలంలో లో అధిక ప్రతిఫలం తీసుకొన్న రచయిత. ఆయన కథలూ, నవలలూ నేడు అమెరికన్ సాహిత్యంలో మహత్తరమైనవిగా పరిగణించబడుతున్నాయి.

1897లో అలాస్కాలో బంగారం దొరుకుతుందని వదంతి పుట్టింది. దానిని తవ్వి తెచ్చుకొనేందుకు పరుగెత్తిన వారిలో జాక్ లండన్ ఒకడు. అక్కడికి వెళ్లేక, మంచుకి శాశ్వతంగా రాయయిపోయిన ఆ నేలను తవ్వడం, టన్నుల కొద్ది మన్ను జల్లించి, చిటికెడు బంగారు సంపాదించడం అర్థం లేని పని అని వెనుతిరిగేడు. కాని ఆ ప్రయాణాలలో సంపాదించిన అనుభవాలను కథలుగా వ్రాసి ఆయన బంగారమే పండించారు. ఆ కథలలో అత్యుత్తమైన వానిలో "తెల్లమొహం" ఒకటి.

దీనిలో హింసా ప్రతిహింసల పరమ కిరాతకత్వాన్నీ, దయాశూన్యతనూ చిత్రించేరు. ఆ రెండూ ఆయన నిత్యజీవితానుభవాలు. అంతకన్న ముఖ్యమైనదింకొకటుంది. ఆశించినది పొందలేక పోయిన బాధ, జీవన్మరణాల మధ్య ఒక పాత్ర చాతుర్యం దీనిలో చూస్తాం. ఆ కథకు సంక్షిప్త పాఠం యిది.

వెంబడే దక్షిణానికి ప్రయాణం చేశాడు. పొడూగునా ఇండియన్‌లతో యుద్ధాలే. రక్తపాతం. హత్యా కాండే. గట్టుకి పట్టి బోతే చాలు ఇండియన్ యోధులు మీద పడిపోయేవారు. కాలిఫోర్నియా వరకూ స్పానిష్ వాళ్లు వచ్చేరని విన్నాడేమో, వారితో కలిస్తే యూరపు చేరుకో వచ్చునని సబిన్‌కోవ్ ఆశ. కాని అక్కడా ఆదిమ జాతులే ఎదురయ్యేరు. స్పానిష్ వాళ్ళు కనబడలేదు. మళ్ళీ వెనక్కి ఉత్తర దిశగా ప్రయాణం.

ఏళ్లు గడిచాయి. కుస్కోక్విమ్ దేశంలో రెండేళ్లు గడిపేడు. రెండు వేసవులు. జూన్ నెలలో కోజెబూ జల సంధి మొగలో గడిపేడు, ఆ సమయంలో అనేక తెగలవాళ్లు అక్కడ సంత కూడుతారు. రకరకాల వస్తువుల మారకం జరుగుతుంది. అక్కడ భూగోళ విషయాలు తెలుస్తాయని సబిన్‌కోవ్ ఎరుగును. నార్టన్ జలసంధి నుంచి, ప్రిన్స్ ఆఫ్ వేల్స్ అగ్రంనుంచి సైంట్‌లారెన్స్ దీవినుంచి, కింగ్ దీవి నుంచి, బర్రో శిఖరంనుంచి కూడా ఎస్కిమోలు వస్తారు. వారి భాషలో ఆ ప్రదేశాల పేర్లు వేరు. దూరాలు కూడా రోజుల లెక్కలోనే చెప్తారు.

సబిన్‌కోవ్ ఈ ఆదిమ తెగల వారి నుంచి సమాచారం సేకరించడానికి అన్ని మార్గాలూ - బెదిరింపులు, బుజ్జగింపులు, లంచాలు - అనుసరించేడు. దారిలో తగిలే అడవులు, నదులు, క్రూర మృగాలు, పరాయి పొడ సహించని ఆటవిక తెగలు, పర్వత పంక్తులు గురించి అనేక మంది నోట విన్నాడు. ప్రతి ఒక్కరూ ఎక్కడో దూరాన, తూర్పున చర్మాల కోసం ఏ పనికేనా వెనుతియ్యని నీలి కళ్ల తెల్ల వాళ్లని గురించి చెప్పేరు. వాళ్లని చూసిన వాళ్లెవరూ లేరు. వారి కథలే చెప్పేరు. దూరాన తూర్పున యుకాన్ నది. అక్కడున్నారు తెల్లవాళ్లు ఇతరు లెరగనిదీ, సబిన్‌కోవ్ గ్రహించినదీ ఒక రహస్యం వుంది. రష్యన్‌లు చెప్పి చూపించే క్విక్‌పాక్ నదీ, ఆ యూకాన్ నదీ ఒక్కటే.

అది గ్రహించిం తరువాత క్విక్‌పాక్ నది వేపు యాత్రకి జనాన్ని పోగుచేయ సాగేడు. ఆ ప్రయత్నంలోనే మలాకాఫ్ తగిలేడు. ఏమాత్రం దయాదాక్షిణ్యాలు ఎరగని పరమ క్రూరులయిన దురంతకులు ఆతని జట్టులో వున్నారు. దానికి సబిన్‌కోవ్ ఉపనాయకుడయ్యేడు. పడవలు పడిచెక్కలు మునిగేదాకా సరుకులు నింపుకొని, ఈ జట్టు క్విక్‌పాక్‌లో ప్రవేశించింది. అయిదు వందల మైళ్లు నది గుండా

ప్రయాణం చేసి మలాతో చేరేరు. అక్కడ ఒక కోట కట్టాలని మలకాఫ్ నిర్ణయం.

మలాతో ఇండియన్లని పోగుచేసు కొనివచ్చి వెట్టిచాకిరి చేయించేరు. పారి పోయిన వాళ్లని పట్టుకొచ్చి, కోట ముందు ముక్కోణానికి అంటతీసి కట్టి, కొరడాలతో కొట్టేరు ఆ దెబ్బలకి ఇద్దరు చచ్చి పోయేరు, కాని, ఆ వారం వంట బట్టి మరెవ్వరూ పారిపోలేదు. ఆ కోట పూర్తయ్యేసరికి మంచు పడడం ప్రారం భించింది. ఇక ఒక్కొక్క ఇండియను తేవలసిన చర్మాల కోటా విధించేరు. తేలేకపోతే మళ్ళీ కొరడా. వాళ్ల పెళ్లాం పిల్లల్ని కోటలో హామీపెట్టు కొన్నారు.

ఆవిధంగా రక్తపుటేరులు పారించేరు. ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నారు. కోట నామరూపాలు లేవు. ఆ మంటల వెలుతురులో సగంమంది తోళ్ల దొం గల్ని నరికేసేరు. మిగిలిన సగం మందనీ చిత్రవధ చేశారు. ఒక్క సబిన్ కోవ్, ఇప్పటికి ఇవాన్ కూడా అనే చెప్పొచ్చు, - బతికి ఉన్నాడు తనకేసి చూస్తూ యకాగా నవ్వుతున్నాడు. వాని ఆలోచన లెల్లావుంటాయో చెప్పటం కష్టం కాదు. అతని మొహం మీద తాను కొట్టిన కొరడా దెబ్బ పుండు కనిపిస్తూనే వుంది. యకాగాని తప్పు పట్టలేడు. కాని, అతడు పెట్టే హింస గురించి ఆలోచన. ఇండియన్ల ప్రధాన నాయకుడు మాకాముక్ని అడుగుదా మనిపించింది. మళ్ళీ అంతలో లాభం లేదనీ అనిపించింది. కట్టుతెంచు కొని కత్తి తీసుకొని యుద్ధం చేస్తూ చావాలను కొన్నాడు. కాని ఆ కట్లు హల్కాగాలేవు. కారిబో చర్మం పట్టీలు. ఇంతలో ఏదో ఆలోచన వచ్చింది. మాకాముక్కు సంజ్ఞ చేసేడు. కోస్తా భాషలు రెండు మూడు మాట్లాడగల వాడిని తీసుకు రమ్మ న్నాడు.

"మాకాముక్. నాకు చావంటే భయం లేదు. నేను చాలా గొప్ప మనిషిని. నాలాంటి వాడు చావడం తెలివితక్కువ. నిజానికి నేను చావను. వాళ్లలాంటి పనికి మాలిన వాణ్ణికాను" అంటూ తన కాళ్ల ముందు మూలుగుతూ పడివున్న ఇవా న్ను కాలితో నెట్టేడు.

"చచ్చిపోడానికి నేనేం అల్లాటప్పా వాడినికాను. నా దగ్గిరో మందు వుంది. అది నాకొక్కడికే తెలుసు. ఇంక ఎల్లాగూ చావను. కనక ఆ మందు ఇస్తాను.నన్నొ దిలెయ్యి."

"ఏమిటా మందు?"

"చాలా గట్టి మందులే" అన్నాడు సబిన్కోవ్ నిర్లక్ష్యంగా. రహస్యం చెప్పనా మాననా అన్నట్లు ఓ క్షణం తటపటాయించేడు.

"చెప్తావిను. ఆ మందు రాస్తే మన చర్మం రాయంత గట్టిగా అవుతుంది. మీరు కొనుక్కొన్న ఇనప కత్తులు మొద్దు

పోతాయి. చర్మం చెక్కు చెదరదు. ఆ రహస్యం చెప్తే ఏమిచేస్తావు?

"ప్రాణంతో వదిలేస్తా".

సబిన్‌కోవ్ హేళనగా నవ్వేడు.

"బతికున్నంత కాలం నా ఇంట్లో బానిసగా వుంచుకుంటా."

అతడు మరింత నవ్వేడు.

"నా కట్లు విప్పు. సావకాశంగా కూర్చుని మాట్లాడు కుందాం."

నాయకుడు సంజ్ఞ చేసేడు. కట్లు విప్పేక సబిన్‌కోవ్ సిగరెట్టు పట్టుకొని, ముట్టించేడు.

"నీవన్నీ అబద్ధాలు. అటువంటి మందు వుంటుందేమిటి?" అన్నాడు మాకాముక్ సగం నమ్మకం, సగం అపనమ్మకంతో.

"బానిసగాకూడావద్దు. వదిలేస్తాలే" అని బేరం పెట్టేడు.

సబిన్‌కోవ్ బహు తాపీగా, నక్క చర్మాన్ని మరో సరుకుకు బేరం సాగిస్తున్నంత తాపీగా మాటలు సాగించేడు.

"అది చాలా గొప్ప మందు. దానితో ఎన్నోమాట్లు ప్రాణాలు రక్షించుకొన్నా. ఒక స్లెడ్జిబండి. లాగేందుకు కుక్కలు. నీ మనుషుల్లో గట్టివాళ్ళు ఆరుగుర్ని నాకు తోడివ్వాలి. మైకలోస్కీకోనకి ఒక నిద్రదూరందాకా వాళ్లువచ్చి నన్ను దిగబెట్టాలి" అన్నాడు సబిన్‌కోవ్.

"నువ్విక్కడేవుండి, మాకావిద్యలన్నీ నేర్పాలి" అన్నాడు మాకాముక్.

సబిన్‌కోవ్ మాట్లాడ కుండా తల అడ్డంగా తిప్పేడు. తలమీద గాయం మచ్చ మాకాముక్ కంట పడింది.

"అదేమిటీ, నీతలమీద గాయంవుందే. నీ మందు వట్టిఅబద్ధం" అని అరిచేడు మాకాముక్.

సబిన్‌కోవ్ ఏమీకంగారు పడలేదు. "కొట్టినవాడు చాలా బలమైన వాడు. నీ కంటే, నీ జట్టులో వాళ్లెవ్వరి కన్నా బలంగలవాడు" అన్నాడు.

"పైగా ఆ మందుకూడా అంతమంచిగాలేదు. దానిలో పడవలసిన బేరీకాయలు ఇక్కడిలా దొరికితేనా? మందు చాలా బలంగా వుంటుంది."

మాకాముక్ ఆలోచించేడు. సబిన్‌కోవ్ కావాలన్నవన్నీ ఇచ్చి పంపుతానన్నాడు.

సబిన్‌కోవ్ నిరాకరించేడు.

"నా మందు ననుమానించి, దానిని అవమానించేవు. కనక నా షరతులు ఇందాకటివి కావు. నాకు బీవర్ చర్మాలు ఒక నూరు ఇవ్వాలి. (మాకాముక్ పళ్లు ఇగిలించేడు). నూరు పౌనులు ఎండు చేపలు ఇవ్వాలి. (మాకాముక్ తల వూపేడు). రెండుస్లెడ్జిబళ్లు, ఒకటి నాకు. వేరొకటి చర్మాలు, చేపలు కోసం. నా రైఫిలు నాకిచ్చెయ్యాలి. ఏమంటావు. ఆ ఆలోచనలో పడి తటపటాయించే వా నామందు ఖరీదు మళ్ళీ పెరిగిపోతుంది" అని బెదిరించేడు.

యకాగా నాయకునితో గుసగుసలాడేడు.

"ఇంతకీ నీ మందు మంచిదన్న నమ్మకం ఏమిటి?" అనడిగేడు, మాకాముక్.

"ఓస్, అదో పెద్ద కష్టం కాదు. ముందుగా నేనా అడివికెళ్ళి బేరికాయలు తేవాలి. నే పారిపోతానని అనుమానం వుంటే నీవాళ్లనో పాతిక మందిని నా వెంట పంపు. కాయలు తెచ్చి మందు చేస్తా. నేనడిగిన వన్నీ సిద్ధంచేసి

అక్కడ పెట్టేక ఆ మందు నా మెడకు రాసుకుంటా. ఆ దుంగ మీద మెడ మోపుతా. మీలో బలమైన వాడిని రమ్మను. నువ్వేనా సరే, నీ గొడ్డలి తీసుకొని నా మెడమీద బలం కొద్దీ కొట్టు, చూడు ఆ మందు బలం నీకే తెలుస్తుంది."

మాకాముక్ ఆశ్చర్యంతో నోరు వెళ్లబెట్టాడు.

"అయితే ఒకటి. ఒక్కొక్క దెబ్బకి మధ్య మళ్ళీ మందు రాసుకోనివ్వాలి. చేసే పనిలో మరీ చచ్చు వుండకూడదు" అని సబిన్‌కోవ్ గుర్తుచేసేడు.

మాకాముక్ ఒక్క క్షణం ఆలోచించి సరేనన్నాడు.

"అదిగో ఆలస్యంచేసి నా మందు నవమానించేవు, దానికి శిక్షగా . ." అటూయిటూ చూసి దూరాన నిలబడ్డ ఒక పొరపళ్లి, మెల్లకన్ను పడుచును చూపించేడు.

"ఆవిడ నీ కూతురు కదూ. నాకిచ్చి పెళ్లిచేయాలి. దానిని నాతో పిలుచుకు పోతాను"

మాకాముక్‌కు కోపం వచ్చింది. కానీ, సబిన్‌కోవ్ లెక్కచేయలేదు. తాపీగా మరో సిగరెట్టు చుట్టి, ముట్టించేడు.

"త్వరగా తేల్చు. నాకు నీ కూతురి నివ్వడం అంటే నా మందును గౌరవించడమన్నమాట."

మాకాముక్ వెంటనే సరేనన్నాడు.

"నేనే గొడ్డలి వేస్తా సుమా"

"ఓ. . .అయితే, వేటు వేటుకి మందు రాసుకోనివ్వాలి."

మృత్యు ముఖంలో వుండి కూడా ముసలమ్మలా బేరమాడుతున్న విధం చూసేక మాకాముక్‌కుగాని, యకాగాకు గాని, మరెవ్వరికీ గాని సబిన్‌కోవ్ మందుమీద అపనమ్మకం మిగలలేదు. అతనిని కాపలాతో బేరి కాయలూ, ఓషధులూ ఏరి తేవడానికి అడవికి పంపేరు. వాళ్ళు వెళ్ళేక యకాగా సలహా ఇచ్చేడు. ఆ "మందు తెలుసుకున్నాక చంపేద్దాం."

"ఎలాగా? మందు రాసుకుంటే మరి చావడే" అన్నాడు మాకాముక్.

"అది చాల బలమైన మందు కదా. కంట్లో రాసుకోడు. కనక బల్లెంతో కంట్లో పొడిచి చంపేద్దాం", అని యకాగా సలహా ఇచ్చేడు.

సబిన్‌కోవ్ అడవిలో చేతికి దొరికిన కాయలూ, ఆకులూ పోగు చేసేడు. గున పాలకి కూడా పగలని మంచు దిబ్బలు తవ్వించి ఏవేవో వేళ్లు పీకున్నాడు.

పెద్ద మంట మీద కుండతో నీళ్లు కళపెళలాడుతుంటే ఏ యే వస్తువులు ఏ వరస క్రమంలో మరుగు నీళ్లలో వెయ్యాలో పక్కనే నిల్చుని, చూస్తున్న మాకాముక్‌కూ, యకాగాకు బోధించేడు. హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినట్లు ఓ చిన్న కేక వేసేడు.

"బతికి వున్నవాని చేతి చిటికెన వేలు కోసి మందులో వెయ్యాలి. తే. యకాగా! నీ వేలు కోసియ్యి."

యకాగా తన వేలు కోసి ఇవ్వడానికి ఒప్పుకోలేదు. చటుక్కున వెళ్లి ఇవాన్ చేతి చిటికెనవేలు నరికి తెచ్చేడు.

"ఇవాన్ ఇంకా చచ్చిపోలేదు. కనక ఇది పనికి వస్తుంది."

సబిన్‌కోవ్ దానిని కుండ కింద మంటలోకి విసిరి, తనకు వచ్చిన ఫ్రెంచి గీతం పాడసాగేడు.

"ఇది మంత్రం. దీనిలోనే వుంది మందు బలం. ఇది సరిగ్గా పాడక పోతే మందు పట్టివ్వదు."

"అయితే నెమ్మదిగా పాడు. మేము నేర్చుకుంటాం" అన్నాడు మాకాముక్.

"అప్పుడేనా. ముందు పరీక్ష పూర్త వాలి. నీ గొడ్డలి మూడు మాట్లూ నా మెడమీది నుంచి తూలిపోవాలి అప్పుడు మంత్రం నేర్చుకుందు గాని."

"కాని మందు అంతగా పనిచెయ్యక పోతేనో" అని మాకాముక్ సందేహం.

సబిన్‌కోవ్ చిరుమన్నాడు. "నా మందు ఎప్పుడూ మంచిది కాకపోవడం వుండదు. ఒక వేళ కాక పోతే వాళ్లందర్నీ చేసినట్లే నన్నూ ముక్కలు ముక్కలుగా నరికేద్దువు గాని."

మాకాముక్‌కు నమ్మకం కుదిరింది.

మందు చల్లారేక "మార్సెల్లే" గీతాన్ని అతి భక్తి శ్రద్ధలలో పాడుతూ, సబిన్‌కోవ్ దానిని మెడకు రాసుకున్నాడు. తాను కోరిన స్లెడ్జిలు, కుక్కలు, చర్మాలు, ఎండు చేపలు, రైఫిలు – అన్నీ వరసగా తన కళ్ల ముందు సిద్ధం చేయించేడు.

"ఏదీ ఆ పిల్ల! పరీక్షముందే ఆవిడని కూడా స్లెడ్జి వద్ద పెట్టాలి"

వెంటనే ఆ పడుచును తీసుకొచ్చేరు. సబిన్‌కోవ్ వరసన అన్నీ చూసుకొని అప్పుడు తన మెడని కర్రదుంగ మీద ఆనించేడు.

"ఇదేం చిన్న పిల్లల ఆట కాదు. గట్టిగా నీ శక్తి కొద్దీ వెయ్యాలి, వేటు" అని ఆఖరు మారు మాకాముక్‌ను హెచ్చరించేడు.

చెట్టునరికే వెడల్పు అంచు గొడ్డలి మాకాముక్ చేతిలో లేచింది. ఒక్క నిముషం మాత్రం వూతం తీసుకొని, సబిన్‌కోవ్ మెడమీద పడింది. మరో క్షణంలో తల ఎగిరి అంత దూరాన పడింది.

ఒక క్షణం అంతా నివ్వెర పోయేరు. క్రమంగా అర్థం అయింది. చర్మాల దొంగ తమరిని బోల్తాకొట్టించి, చిత్రహింసలనుంచి తప్పించు కొన్నాడు. ఆతని పథకం అంతా అందుకే. అది అర్థం అయ్యేక అంతా ఒక్కసారి గొల్లున నవ్వేరు.

మాకాముక్ సిగ్గుతో తలవంచు కొన్నాడు జనం నవ్వుతూనే వున్నారు. వాళ్ల మొహం చూడలేక మాకాముక్ అక్కడి నుంచి చరచరా లేచి పోయాడు. ఎంత అవమానం! ఇంకెవ్వడూ తన్ను మాకాముక్ అని పిలవరు. తెల్లమొహం. అదే ఇంక తన పేరు. చచ్చేదాకా ఇంక ఆ పేరు మాసిపోదు. నాలుగు తెగల వాళ్లూ సాల్మన్ చేపలవేటకి చేరినప్పుడు, సంతలకి సరుకులు ఇచ్చి పుచ్చుకోడానికి వెళ్లినప్పుడు ఈ కథ చెప్పుకని, చెప్పుకని నవ్వుతారు. "తెల్లమొహంగాడు ఒక దెబ్బతో చర్మాల దొంగ మెడ నరికి, వాడికి బాధలేకుండా చేసి పెట్టే"డంటారు. ఇంక తన పేదే – అనుకొని మాకాముక్ కుమిలిపోయేడు.

రచయిత యదార్థాలను మరీ ఎక్కువగా అంటిపెట్టుకుని వుంటే, అది వాస్తవికతను హరిస్తుంది.

చెఖోవ్‌కు రాసిన ఉత్తరంలో గోర్కీ

నా రచనకు ప్రేరణ

మే 7 వ తేదీని పొట్టి శ్రీరాములు మెమోరియల్ హాలులో జరిగిన సాహిత్య గోష్ఠిలో ముగ్గురు రచయితలు తమ "రచనకు ప్రేరణ"ను వివరిస్తూ ప్రసంగించారు. "రూట్స్" అన్న గొప్ప అమెరికన్ నవల గురించి సమీక్ష చదవబడింది.

శ్రీ మహీధర రామమోహనరావు తమ నవల "రథచక్రాలు" రచనకు ప్రేరణ కలిగించిన ఘట్టాల్ని వివరిస్తూ ప్రసంగ వ్యాసం చదివేరు. "1946 లో ఏలూరులో రాజకీయ మహాసభ జరిగింది. దానిలో ప్రకాశం పంతులు గారు కాంగ్రెసు వాదులను ఉద్బోధిస్తూ, గ్రామాలు, పల్లెలలో సమస్యలుతీసుకొని పని చేస్తే తప్ప అక్కడ కమ్యూనిస్టుల ప్రాబల్యాన్ని నిలపలేమన్నారు.

"అందులో తప్పులేదు. అయితే కాంగ్రెసు వాదులు ప్రజా సమస్యలు తీసుకొని పనిచేయడం ప్రారంభిస్తే, ఫలితాలు ఎల్లా వుంటాయి? కాంగ్రెసు వాదులు కమ్యూనిస్టులవుతారనే అపనమ్మకం నాకు లేదు. కాని వారు కాంగ్రెసులో మిగలరనేది నా గట్టి విశ్వాసం.

"నారథ చక్రాలకు అది ఇతివృత్తం అయింది. అయితే నేనా ప్రసంగ విషయం విన్నప్పుడూ, దానిని గురించి ఆలోచించినప్పుడూ, దానిని నవలగా వ్రాస్తానను కోలేదు. ఆ రూపం తీసుకోవడానికి ముఖ్యకారకుడు ఒక పోలీసు ఆఫీసరు. 1947 జనవరి 21 న ప్రకాశం గారు ఆర్డినెన్సు ప్రకటించి నప్పుడు 'ప్రజాశక్తి' పత్రికా కార్యాలయాన్ని సోదాలు జరిపిన పోలీసుదళంతో వున్నారాయన. కాంగ్రెసూ, కమ్యూనిస్టులు ఏకలక్ష్యంతో స్వాతంత్ర్యం కోసం పని చేస్తున్నారు కదా, ఈ ఆర్డినెన్సేమిటి?— అని ఆయన ఆ రోజున నన్నడిగిన ప్రశ్నలలో ఒకటి.

దానికి సమాధానం చెప్పడం అవసరం అనిపించింది. పైన చెప్పిన ఇతివృత్తానికి, గాజుల్లంక పోరాటాలు కథా వస్తువుగా నవలా రూపం ఇచ్చేను. అదే నా "రథచక్రాలు'' అంటూ ఆ స్థితిగతుల్ని తమ నవలలో ఏ విధంగా చిత్రించినదీ శ్రీ మహీధర వివరించేరు.

తరువాత 'రూట్స్' అనే అమెరికన్ నవలను పరిచయం చేస్తూ ప్రసంగ వ్యాసం చదివేరు. (ఆఫ్రికా నుండి అమెరికాకు బానిసగా బలవంతంగా తీసుకరాబడిన ఒక నీగ్రో వారసుడు యీ నవలకారుడు. ఇతివృత్తం అనేక తరాల తనవంశగాథ. దీనిసమీక్ష జులై సంచికలో వుంటుంది.)

శ్రీబొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు తాను వ్రాసిన మొట్టమొదటి కథ "అమావాస్యనాడు" శకునాలూ, ముహూర్తాల పిచ్చిని గురించి వ్రాసినదన్నారు. తన ఇరుగు పొరుగున వుండిన ఒక విద్యావంతుడు ఒక మారు తాను వెళ్ళిన పని విఫలం కావడానికి తాను బయలుదేరిన ముహూర్త దోషం కారణమని వాదించిన ఘటన దృష్టిలో పెట్టుకొని ఆ కథ వ్రాశానన్నారు.

చర్చా వేదిక

తరువాత శ్రీ. డి వి. నరస రాజు తాము మొదట వ్రాసినది "అంతర్వాణి" నాటిక అన్నారు. ఆ నాటిక వ్రాసిన కాలంలో "మహాత్మా గాంధీ" 'అంతర్వాణి'' కి ఇచ్చిన ప్రాముఖ్యం ఆ నాటిక. ఇతివృత్తానికి ప్రేరకమన్నారు. అయితే నాటికారచనకు ప్రేరేపించినది ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటక పోటీలు చూడడానికి, వానిలో పాల్గొనడానికి గల వుత్సాహమేనని అన్నారు.

మే 27 న వీరేశలింగ వర్ధంతిని పొట్టి శ్రీరాములు స్మారక మందిరంలో సాయంకాలం 6గంటలకు జరపడానికి యీ సమావేశం నిర్ణయించింది

ఎసాల్ట్ అండ్ రేప్

మంథా వెంకట రమణరావు

నాలుగో నెల కడుపుతో ఉంది ఆడది. నూతిదగ్గర నీళ్లు తోడుతోంది. ఉదయం పది గంటలయింది. మొగుడు తెలుగు పండితుడు. ఇంటిలోంచి ఒక గావుకేక పెట్టేడు.

"ఏమే! ఎక్కడచచ్చావు! స్కూలుకి వేళయిపోతూంది!"

"వచ్చే వచ్చే!" ఆమెపరుగుతీసింది, ఇంట్లోకి.

"ఏమిటి వచ్చే వచ్చే?" అతనికి చెప్పలేనంత కోపం వచ్చింది. అతనికలా కోపం వస్తూనే వుంటుంది. పెళ్లాం మొహం చూసే సరికి వస్తుందా కోపం. స్కూల్లో అబ్బాయిల ముందు అమ్మాయిల ముందూ నవ్వుతూ, నవ్విస్తూ ఉంటాడు. చలోక్తులు విసుర్తూ ఉంటాడు. కాని ఇంటిదగ్గర పెళ్ళాన్ని చూడగానే ఎందుకొస్తుందో కోపంమరి!

కోపం మరి దేవుడిచ్చిన గుణంగా? కామంతోనే అదీతీర్చేసుకోవాలిగా? స్కూలుమాష్టరు కోపం ఎవరికి ఖాతరు? పెళ్లానికి ఖాతరు! పెళ్లాం అంటే సమాజం నీకిచ్చిన ఆడది. నీ ఆర్జన మీద, నీ మగతనం మీదా, తిండికోసం బట్టకోసం భద్రత కోసం ఆధారపడి ఉన్న ఆవిడ. నువ్వువదిలేస్తే మనవ్యవస్థలో మరెవ్వరూ చేరదీయనిది.

ఎక్కడికిపోతుంది? చచ్చినట్టు పడుంటుంది: ఇద్దరు పిల్లల్ని కనిపెట్టింది — ఇన్‌వెంట్ చేయ్యలేదు. డెలివర్ చేసింది. మరోపిల్లని కనబోతూంది. ఎవ్వరూ ఉంచుకోమన్నా వుంచుకోరు. బొక్కను చేసి వదిలేసేవు. ఇదే పొదుగు లేని ఆవు ఎవరికి కావాలి? నీకు మరి తప్పదు! ఆమెకు నువ్వు మరి తప్పేటట్లులేవు.

అతనికి కోపం వచ్చింది. కోపంవస్తే నేను మనిషిని కానండీ! అంటూ జోకు జోకుతూ ఉంటాడు, మిత్ర బృందంతో. ఆ సంగతి ఆ యిల్లాలికి తెలుసు. కోపం వస్తేఅబోతు. కామం వచ్చినా ఆబోతు ఔతాడని ఆ అబలకి తెలుసు.

"మాటమాటకి జవాబి వు? నీకు కళ్లు నెత్తిమీద కొచ్చాయే!" అవునికస్టే కన్నెతాడుతో, పుస్తెకట్టితెచ్చిన కన్నెని కమ్చితో కొట్టినట్లు కొట్టేడు ఆమె నోరెత్త

లేదు! మూలుగుతూ, కొట్టకండీ! వడ్డిస్తా నండీ అంటూ కాళ్లుపట్టుకుంది.

"నీకు ఒళ్లు కొవ్వెందే! మదంఎక్కు వయిందే!"

ఔను! నీవుపెట్టే పచ్చడి మెతుకులు చారునీళ్లతో ఆమెఒళ్లు కొవ్వింది. మద మెక్కువయింది!

ఆమె నోరెత్త లేదు, ఆమె ఎన్నో పతి వ్రతల కథలు చదివింది. పెళ్లి చేసు కొన్నాక పతేదైవంఅని ఆమె పురాణాలు ఘోషించేయి. ఆ ఘోషతో చెవులు గింగుర్లెత్తిపోయేవి. "మొగుడు చెప్పినట్లు విను. అతడి పాదాలదగ్గర పడుండమే నీకు ధర్మం!" అని అమ్మా నాన్నా చెప్పేరు. పతివ్రతలాఉండక ఆమె ఎలా ఉండగలదు? ఆమెకి అకలి వెయ్యదు. తిండి ఆనందాన్నివ్వదు. ప్రపంచంలో రసుగుల్లాలూ, జిలేబీలూ, ఇడ్లీలూ, దోసెలూ ఉంటాయని ఆమె ఏనాడో మరచిపోయింది. ఈభర్తనే జన్మజన్మలకీ ఇవ్వమని ఆమె కోరుకుంది,

అతడు కొడుతూనే ఉన్నాడు. ఆమె కిక్కురు మనకుండా పడి ఉంది!

ఆరాత్రి పిల్లలు .... మరో గదిలో పడుకున్నాక అతడికి ఆరోజునఎక్కడో చూసిన అందమైన ఆడదాని వంపులు గుర్తుకిరాగా రిఫ్లెక్స్ ఏక్షన్ వల్ల కామం బుసలు కొట్టగా, భార్య మీద ఆబోతులా పడ్డాడు,

"నాకీవేళ బాగుండలేదు! వదిలి పెట్టండీ. తలతిప్పుతోంది! ఒళ్లల్లా దెబ్బల వల్లనొప్పి. కడుపులో తిప్పుతోంది! వద లండీ" – బ్రతిమిలాడింది.

"ఏం? ఎందుకుబాగులేదు నీఒంట్లో? దిమ్మచక్కలా పగలల్లా తిరిగేవే లేచి? మంచం ఎక్కేసరికేనా నీ మూల్గులు?"

"లేదండీ ! పొత్తి కడుపులో బాధగా ఉందండీ! ఈ ఒక్క రోజుకీ ఒదలండి..."

"నా దగ్గరికి వచ్చేసరికే నీకు నొప్పులు? నన్ను యిష్టముండే పెళ్ళాడేవా?"

"నన్నెందు కిలా మాటలతో బాధ పెడతారు? ఈ ఒక్క రోజుకే!" ఆమె కెవ్వున మూల్గింది. కామంతో బుసలు కొట్టే ఆబోతులా ఆమెను ఆక్రమించు కున్నాడు.

ఆడది ఒకపెట్టి. అందులో ఒక మగాడు వుస్తె కట్టగా చిక్కుకున్న ఒక ఆడది. ఆమె మూల్గులు! అధికారం అత డిది. అనుభవం ఆమెది. . ,

అతడు గుర్రుపెట్టి నిద్ర పోయాడు. ఆమెరాత్రల్లా బాధతో ఏడుస్తూనేఉంది. మూల్గుతూనే ఉంది. . .

వార్తాసంగ్రహం

"అభ్యుదయ" పాఠకులు

'అభ్యుదయ' సినీ నటుల బొమ్మలు అవసరంలేని కొన్ని పత్రికలయిన మనకున్నాయని నిరూపిస్తున్నాది. సంతోషం. పాఠకులు ప్రతి ఒకరు, కనీసం మరో యిద్దరు కొత్త పాఠకులకు 'అభ్యుదయ'ను పరిచయం చేస్తే, త్వరలో యింకా అభివృద్ధి పొంద గలదు.

ఒక పాఠకుడు — రూర్కెలా

రూర్కెలా ఆంధ్రులు

శ్రీ వేంకటేశ్వర ఫైన్ ఆర్ట్సు ఎసోసియేషన్ 6వ వార్షికోత్సవం శ్రీ పి. రాధామనోహరన్ ముఖ్య అతిధిగ జరిగింది. శ్రీ సెల్వెస్టర్ ధ్వన్యనుకరణం, "చీమ కుట్టిన నాటకం" ప్రదర్శింపబడినాయి.

పెద్ద కథల పోటీ

నర్సీపట్నం (531116) మిత్రసాహితి తమ ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా రాష్ట్రస్థాయిలో పెద్ద కథల పోటీని నిర్వహిస్తున్నారు. ప్రథమ బహుమతి 250 రూ॥లు, ద్వితీయబహుమతి 150 రూ॥లు, తృతీయబహుమతి 100 రూ॥లు ఇవ్వబడతాయి. 20-25 అరఠావు పేజీలకు మించని కథలను, హామీ పత్రం జత చేసి, జూన్ 30 తేదీలోగా అందేలా పంపాలి. ప్రవేశ రుసుం లేదు. కథతో పాటు స్వంత చిరునామాగల కవరు జత చేయాలి.

గిరిజనుల విద్యకు కృషి

గోండు, కోయ జాతులకు మాతృభాషలలో విద్యకు తెలుగులిపిలో పాఠ్యపుస్తకాల ప్రచురణకు తెలుగు అకాడమీ కృషిచేస్తున్నది. మొదటి తరగతి గోండు పాఠ్య పుస్తకం తయారయింది. రెండునుండి నాలుగు తరగతులకు తయారవుతున్నాయి. వచ్చే ఏడు కోయవారి కోసం యిటువంటి పుస్తకాలు తయారుచేయబడుతాయి.

చాప్లిన్ స్మారక చిహ్నాలు

కలకత్తా మ్యునిసిపల్ కార్పొరేషన్‌కు ఎదుటనున్న చౌకుకు చార్లిచాప్లిన్ పేరు పెట్టబడింది. ఈ చౌకులో చాప్లిన్ విగ్రహం ప్రతిష్ఠాపింపబడుతుంది. చాప్లిన్ చిత్రాల, నిశ్చలచిత్రాల ప్రదర్శనాన్ని ప్రారంభిస్తు పశ్చిమ బెంగాల్ మంత్రి బుద్ధదేవ్ భట్టాచార్జీ నిరంకుశత్వాలను, అన్యాయాలను ఎదిర్చి తీవ్ర పోరాటం సాగించిన యోధునిగా చాప్లిన్‌ను పేర్కొన్నారు.

పూనాలో చాప్లిన్ తపాలా బిళ్లను ప్రసిద్ధ నాటక రచయిత, దర్శకుడు శ్రీ పి. ఎల్. పాండే విడుదల చేశారు.

పాకిస్తాన్ మహాకవి భారతపర్యటన

సుప్రసిద్ధ పాకిస్తానీ ఉర్దూ అభ్యుదయ మహాకవి ఫైజ్ అహమ్మద్ ఫైజ్‌ను, భారత పర్యటనకు భారతీయ సాంస్కృతిక వ్యవహారాల సమితి అహ్వానించింది. ఆయన హైదరాబాద్‌తో పాటుగా పలు భారతీయ నగరాలను సందర్శిస్తారు. ఈ సందర్భంగ ఆయన కవితా స్వర్ణోత్సవాలు హైదరాబాద్‌లో జరుగుతాయి.

కక్ష్యలో మూడేళ్లుగా ఆర్యభట

భారతదేశపు తొలి ఉపగ్రహం ఆర్యభట్ట ఏప్రిల్ 19 నరికి మూడేళ్లుగ కక్ష్యలో వుంటూ, 16 వేలసార్లు భూప్రదక్షిణ చేసిందనీ, అది సంతృప్తికరంగ, ఉద్దేశింపబడిన కార్యక్రమాన్ని సాగిస్తున్నదనీ భారతీయ రోదసీ పరిశోధన సంస్థ ఉపగ్రహయోజన దర్శకుడు డాక్టర్ యు. ఆర్. రావు తెలిపారు.

కరగబోసిన బంగరుగ మారింది" హెచ్చు తగ్గులలో యీ తీరులో వున్న 202 పద్యములు అందంగా అచ్చువేసిన యీ పుస్తకంలో వున్నాయి.

2. 'అరుణయుత అరుణోదయం'లోని 37 ఖండకావ్యాలలో ప్రతిభను ద్యోతకం చేసే పంక్తులు అనేకం. మంచి కవితా చిత్రాలను చూపడమే కాదు, మిరియాల లక్ష్మీపతి అభ్యుదయకర భావుకతనూ వ్యక్తం చేస్తున్నారు. "మేఘాలు . . . నిన్ననే సముద్ర ప్రియుని కౌగిలిలో నిద్రించి, క్షార జలాన్ని మధుర జలంగ మార్చగలిగే శక్తిని అలవర్చుకున్నాయి. "గాలి కెగిరిన ఛాళీవిస్తరిలా భయంగా పొకుతుంది కాలం"; "అదిగో మానవతా సూర్యుడు, ధరిస్తున్నాడు సమతా కంఠహారాన్ని"; "ఎప్పటికో అందరికీ ఒకే బాట, ఎప్పటికో అందరికీ ఒకే మాట? అందరము అందరి కోసం పంద్రంలా పొంగే సంతోషం" వంటి పంక్తులు భావుకతనూ. సామాజిక స్పృహనూ తెలుపుతాయి.

ప్రతిభతో బాటుగా కవిలో కొన్ని బలహీనతలూ కనిపిస్తున్నాయి. వాడిన కవితా సామగ్రి (కాంతి, జ్ఞానం, సూర్యుడు, ఆకాశం, వెన్నెల, సాగరం వగైరా) సంకుచితంగా వుంది. అంత రించిపోయిన భావకవితా సామగ్రియిది. కాని కవి మొగ్గు యింకో విధంగా వుంది. "పసచచ్చిన జాతిని రసశేఖరులుగా" తీర్చాలన్న సదుద్దేశం వున్న కవికి ఉపయోగపడేవి యీ సామగ్రి కాదు. నవకల్పనానికి కావలసిన సామగ్రిని ఏనాడో శ్రీశ్రీ జాబితా రాశారు. కవిత్వంలో కవితావేగం కొరతగ వుండడం వల్ల గుండెకు తగిలే అనుభూతి లభించదు.

ఈ తీరున వుండే వచన కవితలు విద్యావంతుల్ని సంతోష పెడతాయేమో గాని, జనం పాడుకోడానికి వీలుగా వుండవు. అంచేత "పసచచ్చిన జాతిని రసశేఖరులుగ" చెయ్యలేవు. ప్రజలకు సన్నిహితమైన కవితే నిజమైన కవిత.

"ముత్యాల గొడుగు" బాలసాహిత్య రచనలో అనుభవం వున్న మిరియాల రామకృష్ణ పిల్లల కోసం వ్రాసిన పాటల పుస్తకం. "చందమామ పాప పేరు, ఆకాశం అసలు ఊరు", "చల్లగాలి వచ్చినన్ను తాకి పోయింది" వంటివి పిల్లల మనసును తాకేవీ, వారి నాలుకకు అందేవీ దీనిలో కొన్ని పాటలున్నాయి. ఇటువంటి వాటికి చింతా దీక్షితులుగారూ నార్ల చిరంజీవి ఆద్యులు. కాని కొన్ని పాటలు పిల్లల పాటల రూపంలో వున్న పెద్దల పాటలు - "నాకూ కావాలి" వంటివి. అటువంటివి నిజమైన బాల సాహిత్యం కాలేవు.

స్వీకారం

శాస్త్రీయ సోషలిజంపై మార్క్స్, ఎంగెల్స్, లెనిన్	4 - 00
సోషలిస్టు రాజ్యాంగ వ్యవస్థపై లెనిన్	3 - 00
సోషలిస్టు విప్లవం మార్క్స్, ఎంగెల్స్, లెనిన్	3 - 09
సోవియట్ యూనియన్‌లో విద్య - ఎన్. డి. సుందరవడివేలు	3 - 75
సోవియట్ యూనియన్‌లో సోషలిజం నిర్మాణానికి లెనిన్ పథకం	2 - 00
సోషలిస్టు ప్రజాస్వామ్యం హిరేన్ ముఖర్జీ	2 - 25

ప్రతులకు : విశాలాంధ్ర ప్రచురణాలయం, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ - 4

సమీక్ష

నవలలతో సరిసమానంగా కాకపోయినా యించుమించుగా అంత సంఖ్యలోనూ యిప్పుడు ఖండకావ్యాల పుస్తకాలు వస్తున్నాయి. అన్ని సాహిత్య ప్రక్రియలలో లాగనే యీనాటి తెలుగు కవిత్వంలోనూ మంచి చెడ్డలు రెండూ వుంటున్నాయి. తప్పదు. గంగి గోవు పాలలాగా మెచ్చుకోవలసిందీ, గమనించవలసిందీ గంటెడు కాదు, అంతకంటె ఎక్కువే వస్తున్నది. సిద్ధ హస్తులు కాని వారూ, కొన్నయినా మంచి గీతాలూ, కనీసం కొన్ని చరణాలయినా భేష్ అనిపించుకొనేవి రాస్తున్నారు. చేస్తున్న అనేక ప్రయోగాలలో కొన్నయినా హర్షించవలసినవి వుంటున్నాయి. ఎక్కువ భాగం మారుమోతలే అయినా సొంత గొంతుతో పలకడానికి ప్రయత్నిస్తున్న వారు కొంత మందయినా వుంటున్నారు. ఇటు వంటి పరిమితుల దృష్టిలో కొన్ని గీతాల సంపుటాల పర్యవలోకనం:

ఆమె (బెజవాడ గోపాలరెడ్డి, విక్రయ కర్తలు: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 4 – 3 – 550/2, బొగ్గుల్‌కుంట, హైదరాబాద్-500 001– వెల : రూ5.)

ఆరుబయట అరుణోదయం

(మిరియాల లక్ష్మీపతి, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ-4. కళాకేళీ ప్రచురణలు, పిఠాపురం; సిద్ధార్థ సదన్, విశాఖపట్నం – 530016; వెల: రూ.4-50 లు)

ముత్యాల గొడుగు (మిరియాల రామకృష్ణ; విక్రయ కర్తలు: శ్రీమతి మిరియాల లక్ష్మిదేవి, 10 - 4 - 23 రామారావు పేట, కాకినాడ- 4; విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం, అనంతపురం; ఎ. పి. బి. డి., రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్; నవోదయ పబ్లిషర్సు, విజయవాడ; ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, హైదరాబాద్,; వెల: రూ, 3 – 60)

ఉర్దూ, సూఫీకవిత్వాల ఫక్కీలూ, భావకవిత్వ వాసనలు నిండిన పద్యకాల సంపుటం 'ఆమె,' (వీటిని పద్యకాలన్న పేరు రెడ్డిగారు సూచించిన అనేక పేర్లలో ఒకటి.) పారసీ, సూఫీ కవిత్వాల సొగసులను దువ్వూరి రామిరెడ్డిగారు 'పానశాల' అన్న పేరిట ఉమర్ ఖయ్యామ్ గీతాలకు, సాదీమొదలైన మహాకవుల కృతులకు అనువాదం ద్వారా తెలుగు పాఠకులకు చూపించారు. తరువాత గాలిబ్ గీతాలను దాశరథిగారు తెలిగించారు. ఉమర్ ఖయాం అనువాదాలు తెలుగులో ఎంతగా వచ్చాయంటే, అవి శాకుంతలం అనువాదాల కంటే ఎక్కువ. 'ఆమె' లో గోపాలరెడ్డిగారి అనువాదాలు, అనుసరణలూ అటువంటి ప్రయత్నమే కాని, రామిరెడ్డి మొదలైన వారి 'పానశాల' వంటివి కలిగించే రుచులు 'ఆమె'లో ఆశించడం అత్యాశే అవుతుంది. గోపాలరెడ్డిగారికిటు వంటి సాహిత్యం పట్ల వున్న ఉత్సాహం కొద్దీ చేసిన ప్రయత్నం యిది.

"చెరువు కరగ బోసిన వెండిగా నున్నడి. ఆమె సంధ్యస్నానానికి రాగనే

లేఖలు

సమ్మెలు - విప్లవాలు

'అభ్యుదయ' మే నెల సంచికలో శ్రీ సి. డి. ప్రసాద్ వ్రాసిన "మధ్యతరగతులు-సమ్మెలు-విప్లవాలు" అన్న శీర్షికతో లేఖ చూసినాక వ్రాయాలనిపించిన కొన్ని విషయాలు ఇవి:

సమ్మె అన్నది పెట్టుబడి దారీ వ్యవస్థ తెచ్చిన ప్రజాప్రతి ఘటన రూపాలలో ఒకటి. ఎన్. జి. వోల సమ్మె అయినా, కార్మికుల సమ్మె అయినా, మరొకరిదైనా సమ్మె ఐక్య కార్యాచరణ రూపాలలో ఒకటి. దానినే విప్లవం అనుకోడం సరయిన అవగాహన కాదు. సమ్మెలు, ప్రదర్శనలు మొదలైనవి విభిన్న ప్రయోజనాలూ, మనస్తత్వాలూగల వివిధ వ్యక్తులు సమానమైన ఏదో అంశం మీద ఏకమయి నిలబడి, ప్రతిఘటననిచ్చే ఐక్యకార్యాచరణ రూపం. ఆ సమానాంశం ఆర్థికం కావచ్చును. రాజకీయం కావచ్చు, సామాజికం కావచ్చు. ఈ మూడింటి సమ్మేళనతో ఏకంగా సామాజిక వ్యవస్థలోనే మార్పు కోరే విప్లవంతో జమ కట్టడం తప్పు. విప్లవానికి అత్యవసరమైన అత్యున్నత ఐక్యకార్యాచరణకు తరిఫీదు నిచ్చేవి సమ్మెలు. ఈ విషయమై స్పష్టత లేక పోతే దారి తప్పుతాం.

శ్రీప్రసాద్ తమ లేఖ 2, 3, పేరాలలో తెలిపిన అభిప్రాయాలు చాల చిత్రంగా వున్నాయి. దేశాభివృద్ధిలో 90 శాతాన్ని ప్రజలలో 15 శాతం వుండే మధ్య తరగతి వరకేనా జాలువార్చ గల సమ్మెలను "విప్లవం అనే అనాలి" అంటారు. (ఆ పరిమితి ఏమిటో?) లేకపోతే డబ్బున్నవాళ్లు తమ అస్తిత్వానికి భంగం కలగకుండా మధ్యతరగతికి "నాలుగు పరకలు" రాల్చడంగానే భావించాలంటారు.

సమ్మెల మీద థీసిసు రాయడం నా వుద్దేశం కాదు. (వాటిని విప్లవమే అనరాదని పైన చెప్పనే చెప్పను) సమ్మె ఆశయాల, లక్ష్యాల సాధన రెండు పక్షాల శక్తి- సామర్థ్యాలకు పరీక్ష అనాలి. అందులో బలహీనపక్షం ఎప్పుడూ సమ్మెదారులదే. కనక ఆ పరీక్షలో విజయం ఎప్పుడూ సాపేక్షమే. అదొక స్థిరబిందువు కాదు. ఆ సాపేక్షతను నిర్ణయం చేయడంలో జరిగే రాజీబేరాలు ఆయా పక్షాల నిలబడగల శక్తి, ఆయా పక్షాలనాయకుల (ముఖ్యంగా సమ్మె నాయకుల) బలాబలాల అవగాహనశక్తి మీద ఆధారపడి వుంటాయి. ఆ అవగాహన శక్తిని తప్పు పట్టడం కేవలం కుతర్కమేకాని వేరు కాదు. చదరంగంలో ప్రేక్షకులకు మంచి ఎత్తులుగా తోచినవి ఆడేవారికి అలా తోచక పోవచ్చు. అలాగే ఇక్కడాను. మన ఎత్తుగడ గొప్పదనుకోడం తప్పు కాదు. కాని, తద్విరుద్ధంగా ఆలోచించినవారిని ద్రోహులనడం అట్టే సమర్థనీయం కాదు. సబబూ కాదు.

సమ్మె రాజీలో యజమానులు అంగీకరించే లొంగుబాటు షరతులు ఎప్పుడూ వారి దృష్టిలో పెద్ద నష్టం నుంచి బయట పడేందుకై విదిలించే "నాలుగుపరకలే". కాని సమ్మెదారుల దృష్టిలో

ఆడపిల్లలు

కొల్లూరి సూర్యనారాయణ మూర్తి

నాకు ఇద్దరు ఆడ పిల్లలు
మొదటి దాని పేరు "నిన్న"
రెండవది "ఈవేళ"
"నిన్న" కు వయస్సు మీరిపోయింది
పెళ్ళికాక ముందే —
"ఈవేళ" వయసులో ఉంది
అది కాలంతో లేచిపోయింది
మరో పిల్ల పుడితే
దానికి "రేపు" పేరెడతా
వయసు మీరి పోకుండా
దానినయినా ఓ ఇంటిదాన్ని చేస్తా

ఆ "నాలుగు పరకల" విలువ వేరు, వాని విలువ ధనరూపకమే కాదు. నైతికం కూడాను. దీనికి మధ్య తరగతి, కార్మిక వర్గం అనే దానితో నిమిత్తం లేదు. సమ్మెతో విప్లవలక్ష్యం సాధించాలని, ఏ రాజకీయ పార్టీ అనదు. అయితే సమ్మెల ద్వారా సాధించే విజయాలను – అవి చిన్నవే గానీ, పెద్దవే గానీ, పాక్షికమే గానీ, పరిపూర్ణమే గానీ – మోసపోవడాకి ఫలితంగా భావించడం చాల తప్పు.

ఇంక నాయకత్వాన్ని కొనివెయ్యడం గురించి. కొన్ని సంస్థలు చట్టరీత్యా యూనియన్ నాయకులకు ప్రత్యేక సౌకర్యాలు, సౌలభ్యాలు, హక్కులు కలిగిస్తున్నాయి. వానిని యూనియన్లు పోరాటాలతోనే సాధించేయి. ఆ సౌలభ్యాలు, హక్కులు ఇవ్వడం నాయకత్వాన్ని కొని వేయడం కాదు. అవి కొన్ని చోట్ల నాయకత్వాన్ని మెత్తబరుస్తున్న మాట నిజమే. కాని సమ్మెల విజయాల హెచ్చుతగ్గుల్ని నాయకత్వం చేసే మోసానికి కొలబద్ధలుగా చిత్రించడం సమ్మెదారుల మీద అభిమానంగానో, విప్లవాసక్తిగానో భావించడం మాత్రం వట్టి అమాయికత్వం.

ఎందుచేతనంటే యాజమాన్యం ఇచ్చే "నాలుగు పరకలు" కలిగించే సౌకర్యాలు నిజానికి ప్రత్యర్థుల వుత్సాహాన్నీ, ప్రతిఘటననూ చల్లార్చడానికే. అ విధంగా వారిని కొనెయ్యడానికే. దానినే వారు సమ్మెదారుల మధ్య, సమ్మెదారులకూ నాయకత్వానికీ మధ్య, నాయకుల మధ్య కూడ అనుమానాలు ద్వేషాలూ రగల్చడానికి కూడ వుపయోగిస్తారు. రాజీ లొంగుబాటులో భాగంగానే అదీ సాగుతుంది. ప్రతి సమ్మెనూ విప్లవంగా భావించే వారే రాజీలను మోసపోవడంగా చిత్రించగలరు. రాజీకి ఒడబడే వారిని మోసకారులుగా చిత్రించగలరు. ఇది తప్పు.

దానిని గ్రహించకుండా నాయకత్వం అమ్ముడుపోయినట్లు వ్రాయడం నాయకత్వం మీద కార్మికులకూ, వుద్యోగులకూ అపనమ్మకం కలిగించడానికే సాయపడుతుంది. వుద్యమం, యూనియనులూ బలహీనపడడానికి సాయపడుతుంది. సమ్మెదారుల షరతులకు అంగీకరించడంలో యజమానులు పరోక్షంగా ఆశించేది అదే. యిందుకు సాయపడ కూడదు.

ఈ విషయం రా. వి. శాస్త్రి గారు ఎరుగుదురు. "రచయిత ప్రతివాడు తాను రాస్తున్నదివి మంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకు ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం వుందని నేను తలుస్తా" నని ఆయన అన్నదియిందువల్లనే.

కాని, 'వేతనశర్మ' సృష్టి, ఉద్యమ నాయకత్వాలపై అక్కడక్కడ ఆయన విసిరే విసుర్లు ధీమంతుల ప్రమాదం' గానే భావించాలి. ఆ ప్రమాదాలను చూపడం ధీమంతుల వున్నతికి తోడ్పడుతుంది. రచయితల కర్తవ్యం అది.

"అవంతి" మద్రాసు

మన సోవియట్ రచయిత కేవలం రచయితగా, కేవలం రచనా వృత్తి కలవాడుగా వుండలేడు, అతను సజీవుడైన వ్యక్తి. మన దేశంలో జరుగుతూన్న ప్రతి పనిలోనూ, అతను బహుళోత్సాహంతో, క్రియాశీలంగా పాల్గొంటున్నాడు. అతను ప్రతిచోటా పనిచేస్తున్నాడు. పువ్వు పువ్వుకు తిరిగి తేనెను పోగుచేసి, తేనెనూ, మైనాన్ని తయారుచేసే తేనెటీగ వంటివాడు. అతను సర్వవ్యాపి, సర్వద్రష్ట. సర్వజ్ఞుడున్నూ.

మాక్సిం గోర్కీ

★ ★ ★

ఇతరులకు స్వేచ్ఛ నివ్వని వారికి భూమి మీద కాని, మరింకే గ్రహం మీద కాని స్వేచ్ఛవుండదు.

ఉబెర్ట్ హబ్బర్

Edited and Published By T. Venkataramiah, at 15, Arulammal Street, Madras-600 017 and Printed at Sri Venkateswara Printers, Madras-600 021.